ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శుక్రవారం 3 మే 2024










మాట్లాడుతున్న రాయచోటి అసెంబ్లీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న రాజంపేట ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి

రాయచోటిని అభివృద్ధి చేస్తాం





- వెలిగల్లు, శ్రీనివాసపురం రిజర్వాయర్లు పూర్తి చేసి సాగు, తాగునీరు అందిస్తాం
- అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పేరుతో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కోట్లు మింగేశారు
- భూకబ్జాలు చేసి రూ.200 కోట్లకు పైగా కొట్టేశారు
- మార్పు కోసం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిని, ఎంపీ మిథున్‌రెడ్డిని ఓడిద్దాం
- రాంప్రసాద్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందాం
- రాయచోటి ప్రజాగళం సభలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు

రాయచోటి టౌన్, మే 2: అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని, జిల్లా కేంద్రం లేకుండా చేస్తారని అధికార పార్టీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని జిల్లా కేంద్రం ఎక్కడికి వెళ్లదని అవసరమైతే సమీకరణలు చేసి అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అన్నారు. గురువారం సాయంత్రం రాయచోటి పట్టణంలోని నేతాజీ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి భూగర్భ డ్రైనేజీ పేరుతో కోట్లు మింగేశారని ఆరోపించారు. అంతేగాక వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి రాయచోటిలో భూకబ్జాలకు పాల్పడి రూ.200 కోట్లకు పైగా కొట్టేశారని చెప్పారు. రాయచోటి అనేది జిల్లా కేంద్రంగానే ఉంటుందని, ఎవ్వరూ అపోహపడాల్సిన అవసరం లేదన్నారు. అలాగే వెలిగల్లు, శ్రీనివాసపురం, ఝరికోన ప్రాజెక్టులను పూర్తి చేసి ఈ ప్రాంత ప్రజలకు సాగు, తాగునీరు అందిస్తామన్నారు. నాలుగు దఫాలుగా ప్రజలను మభ్యపెట్టి మాయమాటలతో అబద్ధాలతో పబ్బం గడుపుకుంటున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిని తరిమికొట్టడానికి సరైన వ్యక్తిని మీ మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని తెలుగుదేశం పార్టీ తరపున రంగంలోకి దించామని చెప్పారు. మార్పు కోసం ప్రతి ఒక్కరూ రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ రాయచోటి అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని, రాజంపేట పార్లమెంట్ కూటమి అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి 15 సంవత్సరాలుగా ప్రజలను మభ్యపెడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలను చిత్తుచిత్తుగా ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రాజెక్టులు పూర్తి చేస్తాం

వెలిగల్లు, శ్రీనివాసపురం, ఝరికోన ప్రాజెక్టులను పూర్తి చేసి రాయచోటి, చిన్నమండెం, సంబేపల్లె, గాలివీడు మండలాల్లోని అన్ని పల్లెలకు సాగు, తాగునీరు అందించడమే కాకుండా చిన్నమండెంలో మైనార్టీ కళాశాలను ఏర్పాటు చేస్తామన్నారు. అంతేగాక అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు నూతన పరిశ్రమలను తీసుకురావడమే కాకుండా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను కూడా తీసుకొచ్చి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అలాగే ముస్లిం మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్‌ను యధావిధిగా కొనసాగించడమే కాకుండా 50 సంవత్సరాలకే పెన్షన్ ఇస్తామని, దుల్హన్ పథకం, రంజాన్ తోఫా తిరిగి కొనసాగిస్తామని, మసీదుల అభివృద్ధితో పాటు ఈద్గాల అభివృద్ధి, మౌజన్‌లు, ఇమామ్‌లకు జీతాలు ఇస్తామని హజ్ యాత్రకు వెళ్లే వారికి లక్ష రూపాయలు అందిస్తామని ఆయన చెప్పారు. అంతేగాక చంద్రన్న బీమాను మళ్లీ తెస్తామని, ఎవరైనా ప్రమాదంలో చనిపోతే రూ.10 లక్షలు పరిహారం ఇవ్వడమే కాకుండా ప్రమాదానికి గురైన వారికి రూ.5 లక్షలు ఇన్సూరెన్స్ అందజేస్తామన్నారు. బటన్ నొక్కడం ఎవరైనా చేస్తారని, ప్రాజెక్టులు కట్టడం, రైతుల భవిష్యత్తును మార్చడం ఒక్క తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు.

టీడీపీ మ్యానిఫెస్టోతో

సకల జనులకు న్యాయం

తెలుగుదేశం ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టో సకల జనులకు న్యాయం చేసే విధంగా ఉందని, టీడీపీ మ్యానిఫెస్టో ముందు జగన్ మ్యానిఫెస్టో వెలవెలబోతోందని ఎద్దేవా చేశారు. కిరణ్‌కుమార్‌రెడ్డి తాను ముఖ్యమంత్రులుగా ఉన్నాం కానీ మేము ఎప్పుడూ పాసుపుస్తకాలపై బొమ్మలు వేసుకోలేదని, రైతుల భూముల పాసుబుక్కులపైన జగన్ బొమ్మ వేసుకోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఆ భూమి ఎవరిచ్చారు, వాళ్ల తాత ఇచ్చారా, వాళ్ల నాన్న ఇచ్చారా అని ఆయన ప్రశ్నించారు. హూ కిల్డ్ బాబాయ్.. వాళ్ల బాబాయ్‌ను ఎవరు చంపారో ఆ యనకు తెలియదా పక్కనే నిందితుడిని పెట్టుకుని పాపం అవినాశ్‌రెడ్డి అంటున్న జగన్‌కు సిగ్గు లేదన్నారు. మళ్లీ జగన్‌కు ఓటు వేస్తే మీ ఊర్లకు గొడ్డలి వస్తుందని, ఈ దుర్మార్గుడు మళ్లీ రాజకీయాల్లోకి వస్తే మా బతుకులు మారవు అనే విషయాన్ని ప్రతిఒక్కరూ తెలుసుకుని రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. 50 ఏళ్లకే పెన్షన్, వృద్ధులకు రూ.4 వేలు పెన్షన్, మహిళలకు ఉచిత బస్సు సర్వీసు, మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా, రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం, తల్లికి వందనం పథకాలను పొందాలని ఆయన పిలుపునిచ్చారు.

మాజీ ముఖ్యమంత్రి, రాజంపేట పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే అన్నారు. రాయచోటిలో రోడ్‌షోకు వచ్చిన మిమ్మల్ని చూస్తుంటే రాబోయే ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ గెలిచింది అనే విధంగా ఉందన్నారు. 15 ఏళ్లుగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి రాయచోటికి ఏమి చేసిన దాఖలాలు లేవన్నారు. యువకుడు, ఉత్సాహవంతుడు అయిన రాంప్రసాద్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో గెలిపించుకోవాలన్నారు. కడప నుంచి బెంగళూరుకు వెళ్లే రైలు మార్గం అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.190 కోట్లు మంజూరు చేసి పనులను కూడా ప్రారంభించిందన్నారు. అయితే ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలు ఆ రైలు మార్గాన్ని రాయచోటి మీదుగా కాకుండా పక్కదారి పట్టించి రాయచోటి ప్రజలకు అన్యాయం చేశారని ఆరోపించారు. పది సంవత్సరాలుగా ఎంపీగా ఉన్న మిథున్‌రెడ్డి పార్లమెంట్ పరిధిలో ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇసుక, భూమాఫియా, గనులు, ఖనిజాలు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. ఇటీవల మీరు పుంగనూరు సంఘటన చూసి ఉంటారని, బీసీఆర్ పార్టీ రామచంద్రయాదవ్ వాహనాలపై పెద్దిరెడ్డి మనుషులు దాడులు చేసి దౌర్జన్యం చేయడం జరిగిందన్నారు. మనకు దౌర్జన్యం చేసేవారు కావాలా, ప్రజలకు సేవ చేసే వారు కావాలో రాబోయే ఎన్నికల్లో ప్రజలే తేల్చుకోవాలన్నారు.

రాయచోటి టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాయచోటి అభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలన్నారు. రాయచోటి నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కోసం నా జీవితం అంకితమని, 20 ఏళ్ల రాజకీయ జీవితంలో నా జీవితానికి అర్థం చెప్పిన గొప్ప వ్యక్తి నారా చంద్రబాబునాయుడు అని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుపైన, కమలం గుర్తుపైన ఓట్లు వేసి రాయచోటి నుంచి నన్ను, రాజంపేట పార్లమెంట్ నుంచి కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చేలా ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. చంద్రబాబు కడప నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 4.22 గంటలకు రాయచోటిలోని చిత్తూరు రోడ్డులో గల హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడే ప్రత్యేక బస్సులో నాయకులతో ప్రత్యేకంగా మాట్లాడారు. స్థానిక నేతాజీ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభా వేదిక 5.22 గంటలకు చేరుకున్నారు. 5.33 గంటల నుంచి 6.05 గంటల వరకు మాట్లాడారు. అనంతరం 6.30 గంటల హెలికాప్టర్‌లో బయలుదేరి కడపలో జరిగే ప్రజాగళం బహిరంగ సభకు వెళ్లారు.

కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, పుంగనూరు టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మల్లెల శ్రీవాణి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముస్తాక్ హుస్సేన్, టీడీపీ బీసీ సాధికారిత సమితి రాష్ట్ర కన్వీనర్ గురిగింజకుంట శివప్రసాద్‌నాయుడు, ప్రైవేటు విద్యా సంస్థల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ పి.మదన్‌మోహన్ రెడ్డి, నియోజకవర్గంలోని అన్ని మండలాల టీడీపీ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



నేటి నుంచి హోం ఓటింగ్

- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), మే 2: జిల్లాలో హోం ఓటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పోలింగ్ నిర్వహణపై ఆర్‌వోలు, నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 3వ తేదీ నుంచి హోమ్ ఓటింగ్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి సంబంధించి ట్రంకు బాక్సులు తదితర మెటీరియల్ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. హోమ్ ఓటింగ్ ఇన్వాల్వుడ్ అవ్వడానికి వీలులేదని హోమ్ ఓటింగ్ ప్రక్రియ అత్యంత పకడ్బందీగా జరగాలన్నారు. హోమ్ ఓటింగ్‌లో ఓటర్ మాత్రమే ఓటు వేయాలని ఇతరులు ఎవరూ చేయి పట్టుకొని ఓటు వేయించరాదన్నారు. హోం ఓటింగ్ కార్యక్రమానికి సంబంధించి వీడియోగ్రఫీ తప్పకుండా చేయించాలన్నారు. సెక్టార్ అధికారులు జీపీఎస్ ట్రాక్ ఉన్న వాహనాలను మాత్రమే ఉపయోగించాలన్నారు. విభిన్న ప్రతిభావంతులు, 85 సంవత్సరాలు నిండిన సీనియర్ సిటిజన్లకు ఇంటి వద్దనే ఓటు వేసే హక్కును ఎన్నికల కమిషన్ కల్పించిందని ఈ నేపథ్యంలో హోం ఓటింగ్ ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు నియమించిన సిబ్బంది ఈసీ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ ఓటింగ్ ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు.

13న వేతనంతో కూడిన సెలవు

- ప్రైవేటు సంస్థలకు కలెక్టర్ ఆదేశాలు

రాయచోటి (కలెక్టరేట్), మే 2: లోక్‌సభ, శాసనసభలకు ఈనెల 13న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో జిల్లాలో ప్రైవేటు సంస్థల్లో కార్మికులుగా పనిచేస్తున్న ఓటర్లకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని జిల్లాలోని ప్రైవేటు సంస్థలకు కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951 సెక్షన్ 135(బీ) ప్రకారం కార్మికులకు ఈ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లుగా ఆయన తెలిపారు. రాష్ట్రంలో మే 13న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.

ప్రధాని మోదీ సభకు మొదలైన ఏర్పాట్లు

- కలికిరిలో బహిరంగసభ

కలికిరి, మే 2: కలికిరిలో ఈనెల 8వ తేదీ జరగనున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభకు గురువారం ఏర్పాట్లు మొదలయ్యాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజంపేట పార్లమెంటు బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి, టీడీపీ అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి స్వంత మండలం లో ప్రధాని బహిరంగసభ ఖరారైంది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరఫున మోదీ ఈ సభలో పాల్గొంటున్నారు. ఆయ న రాక కోసం సైనిక్ స్కూల్ మైదానంలో మూడు ప్రత్యేక హెలీప్యాడ్‌ల నిర్మాణానికి ఇంజనీరింగ్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ రాష్ట్ర నేతలు చంద్రబా బు నాయుడు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి కలిసి ఒక హెలికాప్టర్‌లో రానున్నట్లు చెపుతున్నారు. బహిరంగ సభ కోసం పాలెం కురవపల్లె సమీపంలో సీఆర్పీఎఫ్ ప్రధాన ద్వారం ఎదురుగా ఉన్న పెద్ద లేఔట్‌ను ఎంపిక చేశారు. ప్రస్తుతానికి 32 ఎకరాల్లో బహిరంగ సభ, సభా వేదికకు ఏర్పాట్లు చేస్తున్నారు. అవసరమైతే మరో 20 ఎకరాలు కూడా కలుపుకునే విధంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలకు రహదార్ల గుర్తింపు వంటివన్నీ ఒకటి రెండు రోజుల్లో నిర్ధారించనున్నారు.



మోదీ సభకు ముమ్మరంగా జరుగుతున్న ఏర్పాట్లు

పెద్దిరెడ్డి అక్రమాలకు త్వరలో ఫుల్‌స్టాప్

- బహిరంగ చర్చకు సిద్ధమా
- జడ్జి రామకృష్ణ సవాల్

మదనపల్లె టౌన్, మే 2: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్యాయాలు, అక్రమాలకు ఫుల్‌స్టాప్ పడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని జడ్జి రామకృష్ణ తెలిపారు. గురువారం మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డిపై తాను పెట్టిన కేసులో చిత్తూరు కోర్టు ఎఫ్‌ఐఆర్ కట్టమని ఆదేశిస్తే కోర్టు ఉత్తర్వులనే పెద్దిరెడ్డి తారుమారు చేయించాడని ఆరోపించారు. పెద్దిరెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే తనతో ఫేస్ టు ఫేస్ వచ్చి చర్చించాలని ప్లేస్ అతను చెప్పినా, నన్ను చెప్పమన్నా ఓకే పెద్దిరెడ్డి సంగతి ఏంటో తేలుస్తానని సవాల్ విసిరారు. మగువ, మద్యం, డబ్బు అడ్డం పెట్టి, బెదిరింపులతో అక్రమాలకు పాల్పడే పెద్దిరెడ్డి పోయేటప్పుడు పిడికెడు మన్ను తప్ప ఏమీ తీసుకుపోలేరన్నారు. అయ్యప్పస్వామి భక్తుడిని అని చెప్పుకునే పెద్దిరెడ్డి తాను పిలిచే డిబేట్‌కు వస్తావా అని సవాల్ విసిరారు. బి.కొత్తకోటలో దళితుడినైన తనపై పెట్టిన కేసు వీగిపోయిందని, దళితుడిపై అక్రమ కేసు పెట్టడంలో తప్పుడు ధృవీకరణ పత్రాలు ఇచ్చిన ప్రభుత్వ డాక్టర్, సిబ్బంది, దీనికి కారణమైన తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిపై తాను బి.కొత్తకోట సీఐకు ఫిర్యాదు చేశానన్నారు. ఆయన పట్టించుకోకపోవడంతో అన్నమయ్య ఎస్పీకి ఫిర్యాదు చేశానన్నారు. దీనిపై కక్ష పెంచుకున్న వైసీపీ నాయకులు రెండు రోజుల క్రితం తన ఇంటిపై, కారుపై దాడి చేసి ధ్వంసం చేశారన్నారు. తమ ప్రాణాలు తీసేస్తామని భయభ్రాంతులకు గురి చేశారన్నారు. దీనిపై సీఐ సూర్యనారాయణకు ఫోన్ చేస్తే ఆయన వ్యంగ్యంగా మాట్లాడారని ఆరోపించారు. తీరా ఈ ఘటన మీడియాలో రావడంతో ఎఫ్‌ఐఆర్ కట్టిన సీఐ తన ఇంటి వద్ద విచారించారన్నారు. కానీ ఈ కేసును తప్పుదోవ పట్టించేందుకు తనతో ఆస్తి వివాదాలు ఉన్నాయని చెబుతూ తన సోదరుడిని బలవంతంగా స్టేషన్‌కు తీసుకెళ్లి అతనే తన ఇంటిపై దాడి చేశారని కేసు తారుమారు చేస్తున్నారన్నారు. అంతేకాకుండా ఏదైనా క్రిమినల్ కేసు విచారణలో ఉన్నపుడు దర్యాప్తు అధికారి ప్రెస్ స్టేట్‌మెంట్లు ఇవ్వకూడదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. కానీ సీఐ సూర్యనారాయణ సుప్రీంకోర్టు తీర్పును ఉల్లఘించి ప్రెస్ స్టేట్‌మెంట్ ఇవ్వడం చూస్తే ఆయన పెద్దిరెడ్డి అనుయాయుడిగా పనిచేస్తున్నాడన్న అనుమానం వస్తోందన్నారు. కాగా సర్వజన మందిర్ సాయిశ్రీనివాస్, హ్యూమన్‌రైట్స్ అంజనేయులు, రాజకీయ పార్టీల జేఏసీ కన్వీనర్ మురహరి, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షురాలు కొండమ్మ తదితరులు జడ్జి రామకృష్ణకు మద్దతు పలికారు.



మదనపల్లెలో విలేకర్లతో మాట్లాడుతున్న జడ్జి రామకృష్ణ

పండుటాకులపై.. పాడు రాజకీయం

- బ్యాంకుల వద్దకు పరుగో..పరుగు
- మండుటెండలో వృద్ధుల ప్రాణాలతో చెలగాటం
- అధికార పార్టీ వైఖరిపై చీదరించుకుంటున్న జనం

రాయచోటి, మే 2 (ఆంధ్రజ్యోతి) : వృద్ధాప్యంలో కాటికి కాలు చాచి..రామ.. కృష్ణా అంటూ... బతుకు ఈడుస్తున్న పండుటాకులపై అధికార పార్టీ పాడు రాజకీయం చేస్తోంది. పెన్షన్‌దారులకు నేరుగా అకౌంట్లలో పెన్షన్ డబ్బులు జమ చేస్తామని చెప్పడంతో చాలామంది గురువారం బ్యాంకుల చుట్టూ తిరిగి విసిగి వేసారిపోయారు. పెన్షన్‌దారులకు వేర్వేరు బ్యాంకుల్లో ఖాతాలు ఉండడంతో తమకు సంబంధించిన బ్యాంకుల వద్ద పలువురు పెన్షన్‌దారులు పడిగాపులు కాశారు. అనేకమంది వృద్ధులు, వికలాంగులు ఉదయం 8 గంటలకే బ్యాంకుల వద్దకు చేరుకుని బ్యాంకుల వద్ద క్యూల్లో నిలుచున్నారు. బ్యాంకుల్లో పలువురి ఖాతాలు మనుగడలో లేకపోవడంతో పలువురు వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సంబంధిత బ్యాంకుల్లో తమ పెన్షన్ సొమ్ము రూ.3 వేలు ఇచ్చేందుకు నిరాకరించి ఆ సొమ్మును బిజినెస్ కరస్పాండెంట్ల ద్వారా తీసుకోవాలని చెప్పడంతో పలువురు పెన్షన్‌దారులు అసహనానికి గురయ్యారు. గత నెల పెన్షన్ సొమ్ము సంబంధిత సచివాలయాల్లో అందచేశారు ఇప్పుడు బ్యాంకులకు తిప్పడంతో పెన్షన్‌దారులు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరికొంత మంది బ్యాంకులకు వెళ్లి తమ పెన్షన్ సొమ్ము జమ అయిందా లేదా అని బ్యాంకుల్లో పరిశీలించగా కొంతమందికి ఇంకా జమ కాకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరిగి వచ్చారు. పలుచోట్ల వృద్ధులు ఎండ తీవ్రతకు వడదెబ్బకు గురై మృత్యువాత పడుతున్నారు. అయితే అది తమ బాధ్యత కానట్లు.. ఈ ఇబ్బందులకు ప్రతిపక్షాలే కారణం అన్నట్లు అధికార పార్టీ దుష్ప్రచారానికి పాల్పడుతోంది.



వాల్మీకిపురం బ్యాంకు వద్ద పెన్షన్ డబ్బుల కోసం వృద్ధుల పడిగాపులు

కూటమితోనే.. ప్రజా సంక్షేమం

జనసేనను గెలిపించి పవన్‌కు బహుమతి ఇవ్వండి



సూపర్ సిక్స్ పథకాలు వివరిస్తున్న ముక్కా వరలక్ష్మి

ఓబులవారిపల్లి, మే 2: గాజు గ్లాసుకు గుర్తుకు ఓటు వేసి అరవ శ్రీధర్‌ను గెలిపించాలని టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి కోరారు. గురువారం మండలంలోని చెన్నరాజుపోడు పంచాయతీలో జనసేన రాష్ట్ర నాయకులు జోగినేని మణి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అధికారంలో వచ్చిన తరువాత అమలు చేసే సంక్షేమ పథకాలను గ్రామస్తులకు క్షుణంగా వివ రించారు. జనసేన అభ్యర్థిని గెలిపించి పవన్ కల్యాణ్‌కు బహుమతిగా ఇవ్వాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వరరాజు, జడ్పీటీసీ మాజీ స భ్యుడు నాయుడోరి రమణ, పున్నాటి వాసుదేవ రెడ్డి, సింగల్ విండో మాజీ అధ్యక్షుడు వేమన సుబ్రహ్మణ్యం నాయుడు, కల్లా చలపతి, మండల ఉపాధ్యక్షుడు గునిపాటి రాయుడు, గునిపాటి కిరణ్, కోటేశ్వరరావు, గజేంద్ర, సుబ్బరాజు, యువ నాయకులు చింతు రాజారెడ్డి, వంకన శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు

అభివృద్ధి కోసం జనసేన అభ్యర్థిని గెలిపించాలి.



కొత్తకోడూరులో ప్రచారంలో పాల్గొన్నకూటమి సభ్యులు

రైల్వేకోడూరు(రూరల్) మే 2: కోడూరు అభివృద్ధి కోసం జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్‌ను గెలిపించాలని కోడూరు మాజీ ఉపసర్పంచ్ నార్జాల హేమరాజ్ మైనారిటీ నాయకులు పఠాన్ మౌలా కోరారు. గురువారం పట్టణంలోని పగడాలపల్లె, కొత్త కోడూరులో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సీనియర్ నాయకులు మస్తాన్, మదార్ సాహెబ్, జనసేన నాయకులు వరికూటి నాగరాజు, వడ్డిపల్లి రమణ, తదితరులు పాల్గొన్నారు.

మేము గెలుస్తున్నాం : రిషికా రెడ్డి



ప్రచారంలో ముక్కా రిషికా రెడ్డి

పుల్లంపేట, మే 2: ఎన్నికల్లో మేము గెలుస్తున్నామని ముక్కా రూపా నంద రెడ్డి పెద్ద కోడలు రిషికా రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని జాగు వారిపల్లి పంచాయతీ సాధు వారిపలెలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నేలపాటి రామచంద్రయ్య నాయుడు, మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, ఉపాధ్యక్షులు కాకర్ల చంద్రశేఖర్ నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ పోలి జగదీశ్వర్ రెడ్డి, యూనిట్ ఇన్‌చార్జ్ చుండు ఈశ్వర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి మే 2: ఎన్డీఏ కూటమితోనే ప్రజా సంక్షేమం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్ తెలిపారు. గురువారం మాలేమార్పురం పంచాయతీలో మండల అధ్యక్షుడు కేకే చౌదరి గరుగుపల్లి గ్రామస్తులు కొండపునేని సుబ్బరాయుడు, హరికృష్ణ, దుగ్గిన సుబ్బరాయుడు పాపయ్య ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి అరవ శ్రీధర్ గాజు గ్లాసు గుర్తుకు, రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి కమలం గుర్తుకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రచారానికి విచ్చేసిన నేతలకు గ్రామస్తులు భారీ ఎత్తున ఘన స్వాగతం పలికారు. అనంతరం గరువుపల్లి గ్రామంలో 20 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందాల అన్న ప్రజల కష్టాలు తీరాలన్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాల న్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ కట్ట గుండయ్య నాయుడు, రామాంజనేయులు, లారీ సుబ్బరాయుడు, అడ్వకేట్ బాలాజీ, కట్లా లోకేశ్, ప్రవీణ్, పెద్దూరు రాజా, నవీన్, కాకర్ల నాగార్జున, బాలు రెడ్డయ్య, గుత్తి నరసింహ, నాన బాల నాగార్జున, బాలక్రిష్ణ యాదవ్, పెంచల్‌రెడ్డి, కరీం, మన్మథ, పగడాల శివ, పవన్ రాజు, శ్రీధర్, కొనిశెట్టి, సుబ్బరాయుడు, రంగయ్య యాదవ్, టీడీపీ జనసేన బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం బాగుపడాలంటే బాబు రావాలి....

రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని వి.వి.కండ్రిక, తిమ్మిశెట్టిపల్లె పంచాయతీలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకు రావాలంటే ఒక డ్రైవర్ అవసరమని ఆ డ్రైవర్ నారా చంద్రబాబు నాయుడు అన్నారు. జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ రాజంపేట బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిట్వేలి మండల అధ్యక్షుడు కే.కే.చౌదరి సీనియర్ నాయకులు నీలకంఠయ్య మైనారిటీ నాయకులు పట్టాన్ మౌలా తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ నేతలను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ముక్కా రూపానందరెడ్డి, కస్తూరి విశ్వనాథనాయుడు

జనసేన పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యం..

రైల్వేకోడూరు, మే 2: జనసేన పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు గురువారం రైల్వేకోడూరు నియోజకవర్గంలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీని ఓడించడమే ధ్యేయంగా పని చేస్తున్నామని తెలి పారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకు పోతున్నామని తెలిపారు. వైసీపీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా జనసేన చేతిలో ఓటమి ఖాయమని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ఐదు మండలాల్లో వేగవంతంగా ప్రచారం చేస్తున్నారన్నారు. వైసీపీ కుయుక్తులు ఈ ఎన్నికల్లో పని చేయడం లేదన్నారు. వైసీపీని చిత్తు, చిత్తుగా ఓడించడానికి ప్రజలు 13వ తేదీన ఓటుతో దుష్టపాలనను తరిమికొట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కస్తూరి, ముక్కా సమష్టిగా టీడీపీమేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్నారు. గ్రామాల్లో తటస్థంగా ఉన్న నాయకులను సమన్వయం చేస్తున్నారు.



ప్రచారంలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్

రైల్వేకోడూరు(రూరల్): మైనారిటీలకు టీడీపీ ఎప్పుడు అండగా ఉంటుందని కోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కారూపానంద రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మైనారిటీ సీనియర్ నాయకుడు బాబా సాహెబ్ అధ్వర్యంలో భారీ స్థాయి లో మైనారిటీలు టీడీపీ తీర్థ పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఖాదర్‌బాషా, తాజుద్దీన్, అబ్దుల్ రహీం, హబీబ్, హబీబుల్లా ముబారక్, మధర్ భాష, జమీర్, అక్బర్ భాష, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు

కాపుసేన నేత టీడీపీలో చేరిక..

కాపుసేన నియోజకర్గ ఇన్‌చార్జ్ సుంకర రవి గురువారం మాజీ ఎంపీ గునిపాటి రామయ్య కుమారుడు గునిపాటి కిరణ్ సీనియర్ నాయకులు కల్లా చలపతి అనుములగుండం చంద్రమోహన్, గునిపాటి రాయుడు అధ్వర్యంలో టీడీపీ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ అభ్యర్థి విజయం కోసం పని చేయాలని కోరారు.



టీడీపీలో చేరిన మైనారిటీలతో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి



టీడీపీలో చేరిన సుంకర రవిని కండువా కప్పి ఆహ్వానిస్తున్న ముక్కా



ముక్కా సతీమణి వరలక్ష్మిని సన్మానిస్తున్న చెన్నరాజుపోడు గ్రామస్థులు

టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఎస్ఎండీ ముస్తాక్‌హుస్సేన్

రాయచోటిటౌన్, మే2: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య దర్శిగా పట్టణానికి చెందిన ఎస్ఎండీ ముస్తాక్ హుస్సేన్‌ను నియమిస్తూ బుధవారం టీడీపీ రాష్ట్ర అధ్య క్షుడు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చే శారు. ఈ సందర్భంగా ఆయన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్, పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, బీద రవిచంద్ర యాదవ్, రాంగోపాల్‌రెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసులరెడ్డి, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రైల్వేకోడూరు జాతరకు చాటింపు

రైల్వేకోడూరు, మే 2: రైల్వే కోడూరు జాతరను అంగరం గ వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు బుధ వారం అర్ధరాత్రి చాటింపు వేశారు. గురువారం అంకాళ మ్మ దేవస్థానం వద్ద జాతర కోసం అంకురార్పణ చేశారు. ప్రత్యేక పూజలు చేశారు. దేవర దున్నపోతుకు పూజలు చేశారు. కుండకు అమ్మవారి ప్రతిమ పెట్టి, ఇంటింటికి తీసుకు వెళ్లి పూజలు చేశారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో జాతర నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా మన్నూరు గంగమ్మ జాతర

రాజంపేట టౌన్, మే 2 : పట్టణంలో గురువారం మన్నూరు గంగమ్మ జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు.తెల్లవారుజామునే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మహిళలు, ప్రజలుమొక్కులు తీర్చుకున్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిక







వైసీపీ నేత సుగవాసి విద్యాధర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సల్లావుద్దీన్ దంపతులకు పార్టీ కండువాలు కప్పుతున్న చంద్రబాబునాయుడు, చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మల్లెల శ్రీవాణి

రాయచోటిటౌన్, మే 2: ప్రజాగళం రోడ్‌షో సందర్భంగా గురువారం టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సమక్షంలో పలువురు వైసీపీ నేతలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మాసాపేటకు చెందిన వైసీపీ నేత డాక్టర్ సుగవాసి విద్యాధర్, బంగారు అంగడి యజమాని ఖాదర్‌హుస్సేన్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ నసీబున్‌ఖానం, మాజీ కోఆప్షన్ సభ్యుడు సల్లావుద్దీన్, ఉభయ రాష్ట్రాల డ్రైవర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఉసిరికాయల సిద్దార్థ గౌడ్‌తో పాటు పలువురు నేతలు, మహిళలు టీడీపీలో చేరారు. టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు సమక్షంలో చంద్రబాబునాయుడు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎన్నికల్లో టీడీపీ విజయానికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు.

చంద్రబాబును సత్కరించిన మల్లెల శ్రీవాణి

రాజంపేట : రాయచోటికి వచ్చిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును తెలుగుమహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మల్లెల శ్రీవాణి కలిసి సత్కరించారు. పూలబొకేను అందజేసి ఆయనను స్వాగతించారు.

ప్రజాగళం సభకు తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు

లక్కిరెడ్డిపల్లె మే 2;తెలుగుదేశం పార్టీ అధినేత నారాచంద్ర బాబునాయుడు రాయచోటిలో నిర్వ హిస్తున్న ప్రజాగళం సభకు లక్కిరెడిపల్లె మండలం నుంచి వేల సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు సుమారు 2వేల మంది ఎంపీటీసీ మాజీ సభ్యుడు మదన్ మోహన్, రాజంపేట పార్లమెంటు డాక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి షఫీ నాయక్ ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుడి చంద్రశేఖర్‌రెడ్డి, తోపిరెడ్డి నవీన్ కుమార్‌రెడ్డి, సిద్దక వెంకటరామిరెడ్డి, వెంకటరామరాజు, మండల బీజేపీ అధ్యక్షుడు వెంకటరామరాజు, ఆంజనేయులు, ముండ్ల రామాంజనేయులు, మూగి వెంకటరమణ, పాల్గొన్నారు.

గాలివీడు: మండలంలో టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి ఆధ్వ ర్యంలో మండలంలోని 17 గ్రామ పంచాయతీల నుంచి వందలాది వాహనాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. గాలివీడు, నూలివీడు, గోరాన్‌చెరువు, పూలుకుంట, బోరెడ్డిగారిపల్లె, అరవీడు, గొట్టివీడు, తూముకుంట, పేరంపల్లి, గుండ్లచెరువు, గోపనపల్లె తదితర గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు తదితరులు సభలో పాల్గొన్నారు.

సంబేపల్లె: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాయచోటి నియోజకవర్గంలోని నేతాజీ సర్కిల్ వద్ద గురువారం జరిగిన ఎన్నికల సభకు కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల నుండి కార్యకర్తలు స్వచ్ఛంధంగా తరలివచ్చారు. చంద్రబాబు సభతో కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపారు.

పెన్షన్‌కోసం వృద్ధుల అగచాట్లు

పెనగలూరు, మే2 : పింఛన్ పొందేందుకు గురువారం వృద్ధులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బ్యాంకులు, కస్టమర్‌కేర్ సర్వీసు పాయింట్లు, ఏటీఎంల వద్ద ఎక్కడచూసినా గుంపులుగుంపులుగా కనిపించారు. బ్యాంకు ఖాతాకు ఆధార్ నెంబరు సీడింగ్ చేయించుకునేందుకు జిరాక్స్ పత్రాలు తీసుకొని బ్యాంకుల వద్దకు పరుగులు తీశారు. నగదు మూడువేలు మాత్రమే తీసుకునే అవకాశం ఉండటంతో కస్టమర్ సర్వీసు కేంద్రాల వద్ద పడిగాపులు కాశారు. బ్యాంకు ఖాతా లేనివారు ఐసీఐసీఐ, బీసీల ఇళ్ల వద్దకు పరుగులు తీశారు. ఓ వైపు మండేఎండలు.. మరో వైపు పింఛన్ ఈ రోజు తీసుకోకపోతే మళ్లీ వస్తుందో రాదో అనే ఆతృతతో ఇబ్బందులు పడ్డారు ఇదిఇలా ఉండగా సచివాలయ సిబ్బంది కార్యాలయాల్లో దర్జాగా గడపడం విశేషం.

సంబేపల్లె: పింఛను మొత్తాన్ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో నగదు తీసుకునేందుకు గురువారం సంబేపల్లె ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు వద్ద వృద్ధులు బారులు తీరారు. పింఛనుదారులపై వైసీపీ ప్రభుత్వం కక్ష సాధిస్తోందని ఈ సందర్భంగా పలువురు వ్యాఖ్యానించారు. గత నెల సచివాలయాల్లో పంపిణీ చేసి ఇబ్బందులకు గురిచేశారు. ఈ నెల ఖాతాలకు జమ చేసి సమస్యలు సృష్టించారని ఆవేదన వ్యక్తం చేశారు.

సకాలంలో పింఛను ఇచ్చి ఉంటే మా తండ్రి బతికుండు..

లక్కిరెడ్డిపల్లె మే 2: పింఛను ఇంటివద్దే ఇచ్చి ఉంటే మా తండ్రీ బతికుండేవాడని సుబ్బన్న కుటుంబ సభ్యులు విలపించారు. మండలంలోని కాకుళవరం పంచాయతీ పిచ్చికుంటపల్లెకు చెందిన. ముద్రగడ్డ సుబ్బన్న బుదవారం బ్యాంక్ ఖాతాలో పింఛను మొత్తం జమ అయ్యిందో .. లేదో తెలుసుకునేందుకు రాయచోటి కెనరా బ్యాంక్ వద్దకు వెళ్లి వడదెబ్బతో కుప్పకూలి మృతి చెందిన విదితమే ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యమే తమ తండ్రి మృతికి కారణమని వారు వాపోయారు. గురువారం పించగుంటపల్లెలో సుబ్బన్నకు అంత్యక్రియలు నిర్వహించారు. ఇది ఇలా ఉండగా గురువారం బ్యాంకుల వద్ద వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పింఛను కోసం ఎండకు ఎండుతూ పడికాపులు కాశారు.

మున్సిపాలిటీ కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలి

రాయచోటి టౌన్, మే 2: మున్సిపాలిటీ కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో మున్సిపల్ కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్మికులకు గ్లౌజులు, సబ్బులు, నూనె, మాస్కులు, పనిముట్లు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, దాంతో కార్మికులు అనారోగ్యానికి గురవుతూ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్నికల అధికారులకు శిక్షణ

రాజంపేట, మే 2: రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో రిటర్నింగ్ అధికారి మోహన్‌రావు అధ్యక్షతన నియోజకవర్గ ఎన్నికల అధికారులకు గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 13న జరగబోయే ఎన్నికల నిబంధనలు, కార్యాచరణ, రూట్‌మ్యాప్‌లు, పోలింగ్ స్టేషన్ల భద్రత తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ సిబ్బంది ఎన్నికల్లో ఎలాంటి తప్పిదాలు చేయకుండా ఆయా ప్రాంత అధికారులతో కలిసి ఎన్నికలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని 41 మంది సెక్టారు అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై దృష్టి పెట్టండి

సుండుపల్లె, మే 2: అన్ని గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో అమర్‌నాథ్ ఆదేశించారు. గురువారం సుండుపల్లె ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రాజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య ఉందని తమ దృష్టికి వచ్చిందని సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని ఎంపీపీ రాజమ్మ సూచించారు. సర్వసభ్య సమావేశానికి ఇద్దరు, ముగ్గురు సర్పంచులు, ఎంపీటీసీలు మినహా ఎవరూ హాజరు కాలేదు. మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశం గురువారం సుండుపల్లె ఎంపీడీవో కార్యాలయంలో తూతూ మంత్రంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ-2 లక్ష్మయ్య, ఏపీవో మాలిక్‌బాషా, ఏపీఎం శ్రీనివాస్, మండల వైద్యాధికారులు, పలు శాఖల అధికారులు, సిబ్బంది, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రాజంపేటలో పోలీసుల కవాతు

రాజంపేట టౌన్, మే2 : రాజంపేట పట్టణంలో పోలీసు కవాతు నిర్వహించారు.. పట్టణ సీఐ మద్దయ్య ఆచారి ఆధ్వర్యంలో పాతబస్టాండు, ఆర్టీసీ బస్టాండు, ఆర్ఎస్ రోడ్డు ప్రాంతాల్లో ఈ కవాతు నిర్వహించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలకు చర్యలు

నందలూరు, మే2 : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ కోరారు. గురువారం మండల పరిధిలోని టంగుటూరు, గటు మీదపల్లి, ఎం.ఎం.పురం, టి.వి.పురం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయడానికి అందరూ పోలీసులకు సహకరించాలని తెలియజేశారు. గ్రామంలో ఎటువంటి ఘర్షణలు జరిగినా కేసు నమోదు చేయడంతో పాటు అరెస్టుచేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.



నందలూరులో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న ఎద్దల సుబ్బరాయుడుతో పాటు సుగవాసి బాలసుబ్రమణ్యం



సుగవాసి బాలసుబ్రమణ్యం ప్రచారానికి ఊరూ వాడా తరలివస్తున్న ప్రజలు



రాజంపేటలో టీడీపీ తరపున ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లెల శ్రీవాణి



రాజంపేట పట్టణం టి.అగ్రహారం ప్రచారంలో బాలసుబ్రమణ్యంకు ఘనంగా స్వాగతం పలుకుతున్న కూటమి నేతలు

సుగవాసి కోసం కదిలిన ఊరూ.. వాడా...

- ఆరు మండలాల్లో పెద్దఎత్తున ప్రచార జోరు
- సోదరుల సుడిగాలి పర్యటన
- పెద్దఎత్తున బీజేపీ, జనసేన, టీడీపీ నేతల ప్రచారం

రాజంపేట, మే 2: టీడీపీ అభ్యర్థి విజయం కోసం రాజంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని సుమారు వెయ్యి గ్రామాల్లో ప్రచారం జోరందుకుంది. సుగవాసి సోదరులు టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలతో కలిసి పెద్దఎత్తున ప్రచారానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు, నియోజకవర్గ టీడీపీ నేత పోలి సుబ్బారెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, మాజీ మంత్రి సి.రామచంద్రయ్య, ఆర్టీసీ మాజీ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు, జనసేన నియోజకవర్గ నాయకులు అతికారి దినేష్, అతికారి కృష్ణ, పార్లమెంటు జనసేన నేత యల్లటూరు శ్రీనివాసరాజు, బీజేపీ పార్లమెంటు అధ్యక్షుడు సాయిలోకేష్, రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్‌నాయుడు ఇలా ఆయా పార్టీల నేతలు, రాజంపేట పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ దగ్గుపాటి నవీన్, గాయత్రి దంపతులు పట్టణంలోని ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నవీన్, గాయత్రి కుమారుడు దగ్గుపాటి జైష్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు తమ కుమారుడు జైష్ పుట్టిన రోజు సందర్భంగా సుగవాసి బాలసుబ్రమణ్యంకు ఆయన సైకిల్ గుర్తును బహూకరించారు. ఈ సందర్భంగా బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ రాజంపేటలోని ప్రముఖ వైద్యులు, న్యాయవాదులు ఇతరులతో తొలిరోజు సమావేశం నిర్వహించడం, రెండవ రోజు పురప్రముఖులతో సమావేశం నిర్వహించి మద్దతు పలకడం, ఆశీర్వదించడం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా పట్టణ ప్రముఖులతో పాటు అన్ని వర్గాల ప్రజలు, నియోజకవర్గ నేతలు తనను ఆశీర్వదించి సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే ఈ ప్రాంత ప్రజల మనోభావాలకు అనుగుణంగా అసెంబ్లీలో తన గళాన్ని వినిపించి, జిల్లా కేంద్రం తేవడంతో పాటు అన్నమయ్య ప్రాజెక్టును పునర్నిర్మించి, మెడికల్ కాలేజీని తెప్పించి రాజంపేట పట్టణంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామన్నారు .ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ సెట్టెం శ్రీరాములు నాయుడు, టీడీపీ సీనియర్ నేతలు మాలేపాటి రామకృష్ణం నాయుడు, మల్లికార్జుననాయుడు, వెంకటేశ్వర్లనాయుడు, విజయకుమార్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బాలసుబ్రమణ్యంకు సైకిల్ బహూకరించిన డాక్టర్ నవీన్, గాయత్రి దంపతులు

టి.అగ్రహారంలో బీజేపీ, జనసేన నేతల ప్రచారం

రాజంపేట పట్టణంలోని టి.అగ్రహారంలో సుగవాసి బాలసుబ్రమణ్యంతో పాటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు, జనసేన పార్లమెంటు నేత యల్లటూరు శ్రీనివాసరాజు, మండల సీనియర్ నేత వెంకటయ్యనాయుడు, స్థానిక నాయకులు శ్రీనివాసరాజు, సుధాకర్, చంద్రశేఖర్‌రాజు, గుణవర్మ, కిషోర్, కళ్యాణ్, వినోద్, తదితరులు పాల్గొన్నారు. సైకిల్‌గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, అదే విధంగా కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలన్నారు.

టీడీపీకి మద్దతుగా సైకిల్ ర్యాలీ

రాజంపేట పట్టణంలో టీడీపీ, బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా దంత వైద్యులు దగ్గుపాటి నవీన్ ఆధ్వర్యంలో సైకిల్‌పై ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నవీన్ మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ వరకు సైకిళ్లపైనే రాజంపేట, పట్టణ రూరల్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించి టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం, బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిలను గెలిపించాలని కోరుతామన్నారు.

ముమ్మరంగా ప్రచారం

రాజంపేట మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మల్లెల శ్రీవాణి, టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తుపాకుల అశోక్, బలిజపల్లెలో మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, నారపురెడ్డిపల్లెలో ఎస్సీ, ఎస్టీ నాయకులు మందా శ్రీనివాసులు, క్లస్టర్ ఇన్‌చార్జి రెడ్డయ్యనాయుడు, పట్టణంలోని అమ్మవారి శాల వీధిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్ నాయుడు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుణవర్మ, పట్టుపోగుల ఆదినారాయణ తదితరుల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. పోలి అప్పారాజుపేటలో మండల టీడీపీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు ఆధ్వర్యంలో మైనార్టీ నాయకులు షావల్లి, యూసఫ్, బాబు ప్రచారం చేశారు.

నందలూరు: ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం నందలూరులో టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం సుడిగాలి పర్యటన చేశారు. ఆడపూరు, మర్రిపల్లి, రాచపల్లె, విజయసాగర్ నగర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను అత్యధిక మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిపించాలని బాల సుబ్రమ ణ్యం విన్నవించారు. ఆర్టీసీ రీజియన్ మాజీ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు మాట్లాడుతూ బాల సుబ్రమణ్యంను గెలిపిస్తే రాజంపేటను జిల్లాకేంద్రం చేయడంతో పాటు అన్నమయ్య డ్యాంను కట్టించి మెడికల్ కళాశాలను తెప్పించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. అదే విధంగా బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ ఎద్దల విజయసాగర్, సుగవాసి కళ్యాణ్, సుగవాసి వంశీ, రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, టీడీపీ నాయకులు రామచంద్రనాయుడు, సుబ్బరాయుడు నాయుడు, నాగయ్యతో పాటు జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

సిద్దవటం: గ్రామ పంచాయతీలో టీడీపీ ఎన్నికల ప్రచారం జోరు అందుకుంది. రాజంపేట నియోజకవర్గ ఎన్‌డీఏ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను గెలిపించాలని ఆయన సోదరుడు జానకీరామ్ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పరపల్లి గ్రామ పంచాయతీలో పేద బలహీన వర్గాలకు చెందిన ఇళ్ల స్థలాలు, డీకేటీ భూములు అడ్డగోలుగా అన్యాక్రాంతం చేశారని శ్మశానానికి వెళ్లేందుకు రహదారి కూడా లేదంటే ఇంత కంటే ఘోరం ఇంకోటి లేదన్నారు. రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం 25 అంశాలతో మేనిఫెస్టో రూపొందించారన్నారు. రాష్ట్ర రాజధాని కావాలన్నా, పరిశ్రమలు తేవాలన్నా చంద్రబాబునాయుడుకే సాధ్యమన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలంటే రాజంపేట అసెంబ్లీ అభ్యర్థి సుగవాసిని, పార్లమెంటు అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వీరబల్లి: అవినీతి రహిత పాలన ఎన్‌డీఏకే సాధ్యమని మాజీ సీఎం, రాజంపేట పార్లమెంటు అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ప్రసాద్ బాబులు తెలిపారు. గురువారం మండల పరిధిలోని వంగిమల్ల దిగువరాచపల్లె పంచాయతీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు వారిని గజమాలలతో ఘనంగా సత్కరించారు. సైకిల్ గుర్తుకు, కమలం గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. రాష్ట్రంలో కూటమి అభ్యర్థులతోనే అభివృద్ధి జరుగుతుందన్నారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, మండల నాయకులు శ్రీధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రెడ్డప్ప రెడ్డి, కల్లూరి రామ్మోహన్‌రెడ్డి, ఎర్రపురెడ్డి సురేందర్ రెడ్డి, పద్మనాభరెడ్డి, అంజనేయులురెడ్డి, మహిళాధ్యక్షురాలు సుబ్బమ్మ, మండల ప్రధాన కార్యదర్శి తోళ్ల సురేంద్ర, భాస్కర్‌రాజు, నేతి రమేష్, చాన్‌బాషా, ఎల్.జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా బీజేపీ పార్లమెంటు అధ్యక్షుడు సాయిలోకేశ్ ఆధ్వర్యంలో మండల బీసీ సంఘం అధ్యక్షుడు జయరాంతో పాటు పలువురిని కిరణ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

బీసీ నేతల ముమ్మర ప్రచారం

రాజంపేట, మే 2: రాజంపేట టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంకు మద్దతుగా రాజంపేట పట్టణ బీసీలు గురువారం సాయంత్రం మూకుమ్మడి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర బీసీ నాయకులు, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చెన్నూరు సుధాకర్, కౌన్సిలర్‌లు మనుబోలు విజయలక్ష్మి, పసుపులేటి సుధాకర్, మాజీ కౌన్సిలర్ మనుబోలు వెంకటేశ్వర్లు, మనుబోలు వెంకట సుబ్బయ్య, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి, బీసీ నాయకులు కుమార్‌ల ఆధ్వర్యంలో ఈ ప్రచారం నిర్వహిం చారు. పట్టణంలోని సుద్దగుంతలు, ఎగువ గడ్డ ప్రాంతాల్లో ఈ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు డీఆర్ఎల్ మణి, మాజీ అధ్య క్షుడు సంజీవరావు, గీతాంజలి కళాశాల అధిపేత ఎస్.వి. రమణ, పార్లమెంటు లీగల్ సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, మైనారిటీ నాయకులు గుల్జార్‌బాషా, అబుబకర్, షామీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



వీరబల్లిలో కిరణ్‌కుమార్‌రెడ్డిని, ప్రసాద్‌బాబును సన్మానిస్తున్న నాయకులు



నారపురెడ్డిపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న ఎస్సీ సెల్ నాయకులు మందా శ్రీనివాసులు



రాజంపేట పట్టణంలో సైకిల్‌పై ర్యాలీకి శ్రీకారం చుట్టిన టీడీపీ నేతలు



రాజంపేట పట్టణం సుద్దగుంతల్‌లో ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్న బీసీ నాయకులు

బైకు అదుపుతప్పి కిందపడ్డ చిన్నారులు

- ఇరువురికి తీవ్ర గాయాలు

పులివెందుల రూరల్, మే 2: పట్టణంలోని రంగనాథ స్వామి ఆలయం రింగురోడ్డు నందు జరిగిన ప్రమాదంలో ఇరువురు చిన్నారులకు తీవ్రగాయాలైన ఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం సాయంత్రం 14 ఏళ్ల కలిగిన హరినందన్‌రెడ్డి, నాలుగేళ్ల వర్షిత, మరో బాలుడు కలిసి స్కూటీపై ఇంటి నుంచి రంగనాథస్వామి ఆలయం వైపు వెళ్తున్నారు. ఆ సమయంలో స్పీడ్ బ్రేకర్ వద్దకు రాగానే బైకు అదుపుతప్పి పక్కనే ఉన్న కరెంటు పోల్‌కు ఢీకొట్టారు. వెంటనే స్థానికులు అంబులెన్స్‌కు ఫోన్ చేసి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స చేశారు. హరినందన్‌రెడ్డికి, వర్షితకు తీవ్రగాయాలు కాగా మరో బాలుడికి స్వల్పగాయాలైనట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదం జరిగి ఆసుపత్రికి తరలించినప్పటికి సంబంధించిన వారు ఎవరో తెలియకపోవడంతో బైకు నెంబర్ సాయంతో వివరాలు సేకరించి తల్లిదండ్రులకు విషయం తెలియజేశారు. ఏరియా ఆసుపత్రికి చేరుకున్న తల్లిదండ్రులు వైద్యుల సూచనతో హరినందన్‌రెడ్డిని, వర్షితను కడపకు తరలించారు. ఈ ప్రమాదంలో హరినందన్‌రెడ్డికి ముక్కు, చెవిలో నుంచి రక్తం వచ్చినట్లు ప్రమాదాన్ని చూసిన పలువురు చెప్పారు. హరినందన్‌రెడ్డి తండ్రి మహేశ్వర్‌రెడ్డి పులివెందుల మండలంలోని నల్లపురెడ్డిపల్లె జడ్పీ హైస్కూల్లో సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నట్లు తెలిసింది. పోలీసులు ప్రమాద వివరాలను సేకరించారు.



తీవ్రంగా గాయపడిన హరినందన్‌రెడ్డి, వర్షిత

వలంటీర్లతో ఓటరు స్లిప్పుల పంపిణీ తగదు

- బీఎల్‌వోలపై చర్యలు తీసుకోవాలని ఆర్‌వోకు వినతి

ప్రొద్దుటూరు, మే 2: వలంటీర్ల సహాయంతో బీఎల్‌వోలు ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తున్నారని, వీరిపై ఎన్నికల నిఘా అధికారులు పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర నాయకుడు సురేష్‌నాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ వీఎస్ ముక్తియార్‌లు ఆరోపించారు. ఆ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లు అందరూ రాజీనామా చేసి వైసీపీ ప్రచారంలో పాల్గొంటుంటే వారితో బీఎల్‌వోలు ఓటరు స్లిప్పులు పంపిణీ చేయడం దారుణమన్నారు. మున్సిపాలిటీలోని 34, 37 వార్డులలోని దొరసానిపల్లె గ్రామంలో ఓటరు స్లిప్పులను వలంటీర్లు పంపిణీ చేశారని, ఇందుకు బాధ్యులైన బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, 24వ వార్డు నాయకుడు ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారు కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న సురేష్‌నాయుడు, ముక్తియార్‌లు

నలుగురు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

- ఆచూకి కనుగొని స్టేషన్‌కు తీసుకొచ్చిన పోలీసులు

చిన్నమండెం, మే 2: మండలంలోని బోనమల గ్రామ పంచాయతీలో నలుగురు పిల్లలతో సహా తల్లి అదృశ్యమైనట్లు ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... బోనమల హరిజనవాడ నివాసి అయిన శెట్టిపల్లె వరదరాజు భార్య అఖిల అలియాస్ (వాణి) తన భర్తతో ఏప్రిల్ 30న ఘర్షన పడి మే 1న ఉదయం 6- 9 గంటల సమయంలో తన నలుగురు పిల్లలతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. వీరిలో ముగ్గురు మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటుండగా, చిన్న కుమారుడు ఇంటివద్దే ఉంటున్నాడు. కాగా భార్య, భర్తల మధ్య మనస్పర్ధలు ఏర్పడడంతో పిల్లలను వెంటపెట్టుకొని తల్లి కనిపించకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారించి గురువారం సాయంత్రం వారి ఆచూకి కనుగొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు పోలీసులు తెలిపారు.

ఆరుగురిపై కేసు నమోదు

చాపాడు, మే 2: మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులైన సింపతి జాకీర్, లాల్‌బాష, ఫక్రుద్దీన్, నాగదస్తగిరిరెడ్డి, నాసల్, హబీబుల్లా అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 1న బుధవారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన వైసీపీ వర్గీయుడైన వేపరాలపల్లె జాఫర్ అనే వ్యక్తిపై వీరు దాడి చేసినట్లు చెప్పారు. వీరంతా కారులో వచ్చి జాఫర్ బషీర్ టీ బంకు వద్ద ఉండగా అతన్ని లాగి గొంతుపై కాళ్లు వేసి గొట్టిగా తొక్కినట్లు తెలిపారు. దీంతో అతనికి మూగదెబ్బలు తగిలాయన్నారు. జాఫర్ టీడీపీలోకి రావాలని వారు బలవంతంగా ఈ చర్యకు పాల్పడినట్లు ఎస్ఐ చెప్పారు.

గాలి మాట నీటి మూట

- మాటిచ్చారు.. మడమ తిప్పారు
- తాగు, సాగునీరు.. వైద్యసేవలకు తూట్లు
- హామీలు మరిచిన పాలకులు
- మోసగించారని ప్రజల ఆగ్రహం

ఝరికోన ప్రాజెక్టు మొరవ





సుండుపల్లె, మే 2: జగన్ చెప్పాడంటే చేస్తాడు అంతే.. అని రాష్ట్రమంతా ప్రచారం చేస్తున్న వైసీపీ నేతల మాటలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే వంద శాతం హామీలు అమలు చేసిన ఘనత జగన్ మోహన్ రెడ్డిదని డప్పు కొడుతున్న పాలకులు ఇచ్చిన హామీలను మరిచిపోవడం విడ్డూరంగా ఉందని సుండుపల్లె మండల ప్రజలు వైసీపీపై తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో మండల ప్రజలకు వైసీపీ జెండా సాక్షిగా ప్రమాణం చేసి రైతులకు సాగు, తాగునీరు, మెరుగైన వైద్య సేవలు అందిస్తామని మాటిచ్చారు. వారి మాటలను నమ్మిన 42 వేల మంది ఓటర్లను మోసం చేశారని విమర్శలు వస్తున్నాయి. ప్రజలకు తీరా తెలిసి వచ్చేలోపు ఐదేళ్ల వైసీపీ పాలన ముగిసింది. ప్రజలకు చేసిందేమీ లేకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటుతో గుణపాఠం చెప్పేందుకు సిద్దమయ్యారు. ఏ మంచి చేశారని మొహం పెట్టుకుని వచ్చి ఓటు అడుగుతున్నారని ఓటర్లు వైసీపీ అభ్యర్థులు, నేతలను నిలదీసే పరిస్థితి మండలంలో తలెత్తుతోంది.

కలగానే 30 పడకల ఆస్పత్రి

సుండుపల్లె మండలం ఓ మారుమూల ప్రాంతం. సుమారు లక్షకు పైగా జనాభా కలిగిన మండలంలో సరైన వైద్యం అందక నిరుపేద కుటుంబాలు వందలు, వేలు, లక్షల రూపాయలు వెచ్చించి ప్రైవేటు వైద్యం పొందాల్సిన దయనీయ పరిస్థితి దాపురించింది. మెడికల్ మాఫియా ప్రజల రక్తాన్ని జలగల్లా పీల్చేస్తున్నాయి. 14 గ్రామ పంచాయతీల్లో 261 పల్లెల నుంచి ప్రజలు నిరంతరం మండల కేంద్రానికి పలు రోగాలతో వచ్చే పరిస్థితి ఉన్నా వైద్యం రోగులకు అందని ద్రాక్షలా మారిందని ప్రజలు వాపోతున్నారు. సుండుపల్లెలో నేడో.. రేపో 30 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేస్తామని గాలి మాటలు చెప్పడం తప్ప వారి హామీలు నెరవేర్చిన పాపాన పోలేదని ప్రజలు వాపోతున్నారు. 2019 ఎన్నికల సమయంలో ఎంపీ, ఎమ్మెల్యేలు 30 పడకల ఆస్పత్రి వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే శంకు స్థాపన చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పిన మాటలు నేటికీ నీటిపై రాతల్లాగే మిగిలిపోయాయి. కనీసం ప్రసవాలు జరిగినా తల్లీబిడ్డలు, ఇతర రోగులు ఉండలేని దయనీయ పరిస్థితి సుండుపల్లె ప్రభుత్వ వైద్యశాలలో దాపురించింది. ఎన్నికలు వస్తున్నాయి మళ్లీ అవే హామీలు గుప్పించి జనాల ఓట్లు దండుకునే ప్రయత్నం చేయడం తప్ప ఇంకేమీ లేదని మండల ప్రజలు బహిర్గతంగా మాట్లాడుకుంటు న్నారు.

టీడీపీ మొదలెట్టింది...
వైసీపీ పక్కకు నెట్టింది

2019 ఎన్నికల సమయంలో వైసీపీ అభ్యర్థులు ఇచ్చిన హామీలు కలగానే మిగిలిపోయాయి. రోళ్లమడుగు నీటి పథకం కరువు సీమలో ప్రజల దాహార్తి తీరుస్తుందని ఎదురుచూస్తున్న ప్రజలకు నిరీక్షణే మిగులుతోంది. ఏడేళ్ల కిందట టీడీపీ ప్రభుత్వంలో వెనుకబడిన ప్రాంతాలకు కేటాయించిన అభివృద్ధి నిధుల నుంచి రూ.50 కోట్లతో రోళ్లమడుగు నీటి పథకం మంజూరైంది. ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి ఏర్పాటు చేయాలన్నదే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని మంజూరు చేసింది. 2018 నాటికి పూర్తి కావాలన్న లక్ష్యమైనా పను లు పూర్తి కాలేదు. కొన్ని పనులు పూర్తి కాగా వాటికి రూ.13 కోట్ల చెల్లింపులు జరిగాయి. ఆ తర్వాత గడువు దాటిపోవడం, నిధులు లేక ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. పొలిమేరపల్లె, చిన్నగొల్లపల్లి, మడితాడు, సుండుపల్లె, రాయవరం పరిధిలో 86 పల్లెలకు ఈ పథకం పూర్తయితే నీరందుతుంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా టీడీపీ ప్రభుత్వంలో ఇంటింటికీ తాగునీటి కుళాయి ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ఈ పథకం ప్రారంభమైంది. మళ్లీ 2024 ఎన్నికల సమయంలోనూ తాగునీటి సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. శాశ్వత తాగునీటి సమస్యను పరిష్కరించి ఎన్నికలకు వస్తామని అధికార పార్టీ నేతలు చెప్పిన హామీలు పరిష్కరించడం పక్కన పెడితే కనీసం వైసీపీ పాలనలో పనులు ప్రారంభించక పోవడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్ఆర్ ఆశయానికి తూట్లు

నిండా నీరున్నా, కాల్వలు లేకపోవడంతో భూములన్నీ బీడు వారి, సాగుకు నోచుకోని పరిస్థితి ఝరికోన జలాశయం పరిధిలో నెలకొంది. జలయజ్ఞంలో భాగంగా ఉమ్మడి రాష్ట్రంలో పుష్కరకాలం కిందట అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో బాహుదా నదిపై సుండుపల్లె, సంబేపల్లె, కేవీపల్లి మండలాల సరిహద్దులో ఝరికోన జలాశయం సుమారు 0.5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాల్వల నిర్మాణం నిమిత్తం శంకుస్థాపనకు ముహూర్తం నిర్ణయించినా, చివరి క్షణంలో ఆర్థికశాఖ అనుమతి రాక కార్యక్రమం రద్దయింది. ప్రభుత్వాలు మారినా పంట కాల్వల నిర్మాణానికి మోక్షం లభించలేదని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో పాలకులు వచ్చి గాలిమాటలు చెబుతున్నారే తప్ప కాల్వ నిర్మాణం చేసింది లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అర్ధంతరంగా ఆగిన రోళ్లమడుగు వాటర్ ట్యాంకుల నిర్మాణం



కొలిమిట్ల వరకు వేసిన పైపులైను



సుండుపల్లె ప్రాథమిక వైద్య కేంద్రం

కాల్వలు తవ్విస్తామని మాట తప్పారు



ఝరికోన ప్రాజెక్టు నుంచి సుండుపల్లె మండలానికి సాగునీటి కాల్వలు తవ్విస్తామని 2019 ఎన్నికల సమయంలో వైసీపీ నేతలు చెప్పారు. ఓట్ల కోసం రైతులను మోసం చేయడం దౌర్భాగ్యం. సాగునీటి కాల్వలు పూర్తి అయితే మండల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. చెరువులు, కుంటలు నీటితో కళకళలాడతాయి. ప్రాజెక్టు నుంచి బాహుదానదిలో కాల్వలు ఏర్పాటు చేయకపోవడం రైతులను మోసం చేసినట్టే అవుతుంది. మాట తప్పం మడమ తిప్పమని చెప్పి మోసం చేశారు.

సుబ్బరామరాజు, రైతు మిత్ర సేవా సంఘం అధ్యక్షుడు

నీటి పథకం పూర్తి చేయాలి



టీడీపీ ప్రభుత్వంలో సుండుపల్లె మండలంలో మొదటి విడతగా 163 పల్లెలకు తాగునీటిని అందించాలన్న సంకల్పంతో రోళ్లమడుగు నీటి పథకాన్ని శంకుస్థాపన చేశారు. వైసీపీ అధికారం లోకి వచ్చిన తరువాత ఐదేళ్లలో కనీసం పనులు ప్రారంభించకపోవడం దౌర్భాగ్యం. నీటి పథకం పూర్తి కావాలంటే మళ్లీ టీడీపీ అధికారంలోకి వస్తేనే జరుగుతుంది. ప్రస్తుతం మండలంలో తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రామాంజులు, చెన్నంశెట్టిపల్లె

హోరెత్తిస్తున్న ప్రచార రథాలు

పోటాపోటీగా వైసీపీ, టీడీపీ, కాంగ్రెస్ వాహనాలు
ప్రచారంలో వాహనాలదే అగ్రస్థానం

పులివెందుల రూరల్, మే2:పులివెందులలో ఎన్నడూ లేని విధంగా ప్రచార రథాలు హోరెత్తిస్తున్నా యి. ఒకనాడు అభ్యర్థులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి ఓట్లు అభ్యర్థించేవారు. అభ్యర్థిని పదేపదే గుర్తుచేసేలా గోడలపై పేర్లు రాసి ఓటు వేయాలని కోరేవారు. ఇది గతం. ఇపుడు ట్రెండ్ మారిపోయింది. ప్రచార రథాలు ఓటర్లకు చేరువ అవుతున్నాయి. తమ అభ్యర్థులను పదేపదే గుర్తుచేస్తూ వీధివీధిలో, వాడవాడల్లోనూ ప్రచార రథాలు డీజె సౌండ్ సిస్టం తో హోరెత్తిస్తున్నాయి. వాహనాల ముస్తాబు, పాటలతో అభ్యర్థి బలం బయటపెట్టేస్తున్నాయి. ఒక పార్టీకి మించి మరో పార్టీ వాహనాలను ఏర్పాటుచేసి పట్టణంలో తిప్పుతూ ప్రచారాలు సాగిస్తున్నాయి. ప్రజల్లో ఊపు తెచ్చేలా డీజే సౌండ్ సిస్టం ఏర్పాటుచేశారు. ఆయా పార్టీల అధినేతలు, అభ్యర్థి ఫొటోలు, పార్టీ జెండాలు, లైటింగ్, డీజే సిస్టమ్‌లు వాహనాలను తయారు చేసి అభ్యర్థుల కంటే ముందే ఆయా ప్రాంతాల్లో వాహనాలు దర్శనమిస్తున్నాయి. పులివెందులలో వైసీపీ, టీడీపీ కాంగ్రెస్ పార్టీలు తమ ప్రచార రథాలను వాడవాడలా పంపిస్తున్నారు. కాంగ్రెస్ జీపులు, ఆటోలు, డిజిటల్ డిస్ప్లే సెట్టింగ్‌తో వైఎస్ షర్మిల సభలు వీడియోలను ప్రదర్శిస్తూ ప్రచారంలో ఒకడుగు ముందున్నారు. ఏదిఏమైనా ప్రచారంలో అభ్యర్థులకు కంటే వాహనాలే ముందున్నాయనడంలో సందేహం లేదు.



పులివెందులలో టీడీపీ ప్రచార రథం




పులివెందులలో డిజిటల్ డిస్ప్లే సెట్టింగ్‌తో ప్రచార రథంతో వైఎస్ షర్మిల ప్రసంగం

కార్యకర్తలకు వేలు.... నేతలకు కోట్లు..!



రైల్వేకోడూరు, మే2: ఏ పార్టీలోనైనా ఎన్నికల సమయంలో కార్యకర్తలకు వేలాది రూపాయలు, నేతలకు కోట్లు ఇస్తు న్నారని ప్రచారం రైల్వేకోడూరులో జోరుగా సాగుతోంది. ప్రతి ఎన్నికల్లోనూ ఇదే తంతు సాగుతోంది. ఓట్లు కల్గిన నేతలను పట్టుకోవడం వారికి నచ్చజెప్పడం అడిగినంత ఇస్తుంటారు. మొదటి నుంచీ జెండా పట్టుకుని నడుస్తున్న కార్యకర్తలకు వేల రూపాయలు ఇస్తారు. ఇదే విషయమై ఎక్కడా చర్చనీయాంశంగా మారింది. బాగా ఓటు శాతం ఉన్న కార్యకర్తలకు అడిగిన సొమ్ములు ఇవ్వకపోవడం, ఓట్లు లేని నేతలకు కోట్లు ఇవ్వడం ఏమిటని పలు పార్టీల కార్యకర్తలు నేతలను నిల దీస్తున్నారు. ఇటీవల ఒక పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తన నామినేషన్‌కు జనాలు రావాలని పంచాయితీకి రూ. 50 వేలు ఇచ్చినట్లు ప్రచారం సాగింది. ఇదే నేతలకు ఇంకెంత ఇచ్చి ఉంటారో అని రైల్వేకోడూరులో చర్చ సాగుతోంది. వేలు, లక్షలు, కోట్లు డబ్బులు ఎక్కడివి ఎలా వస్తున్నాయి, ఎలా ఇస్తున్నారు, ఎక్కడి నుంచి వస్తున్నాయనేది అంతుపట్టడం లేదు. ఇది కూటమికి కలసి వచ్చేలా ఉందని రాజకీయ నిపుణులు చెబుతున్నారు.

ఇంటి వద్దకే ఓటు



కడప (ఎర్రముక్కపల్లె), మే2: ఎన్నికలకు సంబంధించి భారత ఎన్నికల సంఘం తాజా నిర్ణయం తీసుకుంది. 85 ఏళ్లు దాటిన వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం కల్పించింది. వీరు పోలింగ్ కేంద్రానికి వెళితే సరే లేదంటే అధికారులు ఇంటి ఇవద్దకే వచ్చి వారి ఓటును వినియోగించుకునేలా రూపకల్పన చేసింది. సర్వేలో గుర్తించిన వారి ఇళ్లకు పోలింగ్ అధికారులు వెళ్లి వారి దగ్గర ఉండి ఓటు వేసేలా చర్యలు చేపడుతున్నారు. తొలివిడత మే 7,8 తేదీల్లో జరగనుంది. ఈ రెండు తేదీల్లో ఓటు వేయలేని వారికి మరోసారి 9, 10 తేదీల్లో ఓటు వేసేలా ఎన్నికల సంఘం ప్రణాళిక రూపొందించింది. కార్యక్రమంలో ఎఆర్‌ఓ పర్యవేక్షణాధికారిగా వ్యవహరిస్తారు. సహాయకులుగా సెక్టోరియల్ అధికారులు, బీఎల్‌ఓలు పోలీసు సిబ్బంది, వీడియో గ్రాఫర్లు, పోలింగ్ కేంద్రాల పరిధి ఏజంట్లు ఉంటారు.

మీకు తెలుసా...

బైండోవర్ అంటే...

కడప (ఎర్రముక్కపల్లె), మే 2: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తరచూ వినిపించే మాట బైండోవర్. అనగా బాండ్ ఫర్ గుడ్ బిహేవియర్. ఎన్నికలు జరుగుతున్న సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలి గించే వారిపై అధికారులు ప్రత్యేక నిఘా పెడతారు. అలాగే గొడవలు సృష్టించేవారు, రౌడీషీటర్లు, బెల్టు దుకాణదారులు, ముఖ్యంగా అసాంఘిక శక్తులపై నిఘా ఉంచుతారు. ఎన్నికల సమయంలో ఫలానా వ్యక్తులతో సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని గ్రహిస్తే అతడి చర్యలు అనుమానాస్పదంగా ఉన్నాయని రుజువైతే పోలీసులు బైండోవర్ చేస్తారు. అటువంటి వారిని తహసీల్దారు, ఆర్డీఓ ఎదుట హాజరు పరుస్తారు. ఎన్నికల సమయంలో చట్ట వ్యతిరేక చర్యలు చేయబోమని బాండ్ పేపరు మీద రాతపూర్వకంగా హామీ తీసుకుంటారు. ఆవ్యక్తి ఆ రోజు నుంచి ఏడాది పాటు ఎలాంటి నేరాలకు పాల్పడకూడదు. అలా పాల్పడితే ఇచ్చిన బాండ్ ఎంత మొత్తం నగదు నమోదు చేసి ఉంటారో అంత మొత్తం జరిమానా చెల్లించాలి. అలా చెల్లించకపోతే నేరంగా పరిగణిస్తారు. అతడిపై ఏపీసీ సెక్షన్ 106, 107, 108. 110 కింద కేసు నమోదు చేస్తారు. రెండు అంత కన్నా ఎక్కువసార్లు బైండోవర్ అయితే రౌడీ షీట్ నమోదు చేసే అవకాశం కూడా ఉంది. అక్రమంగా పోలీసులు బైండోవర్ చేశారని ఎవరైనా భావిస్తే హైకోర్టులో రెడ్‌పిటిషన్ దాఖలు చేసుకోవచ్చు.

ఆయా రాం.. గయా రాంలు ఎవరబ్బా!



కలికిరి, మే 2: రాజకీయాల్లో ఆయా రాం.. గయా రాంల పాత్ర అబ్బో తక్కువేమీ కాదు. సాధారణ ఎన్నికలు, అసెంబ్లీ పార్లమెంటులో బలపరీక్షలు తదితర కీలక సమయాల్లో ఈ ఆయా రాం, గయా రాంలు చక్రం తిప్పుతుంటారు. ప్రజల దృష్టినంతా తమ వైపు మళ్లించుకుంటారు. మన పక్క అయితే ఏదో 'గోపీ'లంటాం (గోడమీద పిల్లులు)గానీ ఈ ఉత్తరాది నుంచి వచ్చిన ఆయా రాం.. గయా రాంలవి మాత్రం మహా గొప్ప విన్యాసాలే. వీళ్ల కథేందో ఒకసారి చూద్దాం. అసలు ఈ ఆయారాం.. గయా రాంలు ఇద్దరు కాదు ఒక్కరే అంటే నమ్మ శక్యం కాదు. 1967 హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో పల్వాల్ జిల్లా హోదల్ అసెంబ్లీ స్థానం నుంచి గయా లాల్ ఇండిపెండెంట్‌గా గెలుపొందారు. సీఎం ఎన్నిక కోసం గయా లాల్ ఓటు కీలకమై కూచుంది. ఈ మహానుభావుడు ఒక్క రోజులోనే ఏకంగా మూడు పార్టీలు మారారు. చివరకు కాంగ్రెస్ గూట్లోకొచ్చి పడ్డాడు. ఆ పార్టీ నాయ కుడు, సీఎం రేసులో వున్న రావు బీరేంద్ర సింగ్ ఇట్లా కాదని గయా లాల్ మా వాడే నంటూ నేరుగా విలేకరుల ఎదుట హాజరు పరిచారు. గయా లాల్‌ను పరిచయం చేస్తూ 'అప్పుడు గయా రాం.. ఇప్పుడు ఆయా రాం' కితాబిచ్చారు. ఇక అప్పట్నుంచీ పార్టీలు ఫిరాయించే వారిని ఆయా రాం.. గయా రాంలుగా పిలవడం మామూలైంది.

సమ్మర్ హాలిడేస్...

ఎన్నికల సంబరాల్లో చిన్నారులు



పార్టీ జెండాలు పట్టుకుని సంబరాలు చేసుకుంటున్న చిన్నారులు

రాజంపేట, మే2: సమ్మర్ హాలిడేస్ సందర్భంగా ఇంటిపట్టున ఉండాల్సిన చిన్నారులకు ఎన్నికల పండుగ బాగా కలిసి వస్తోంది. ఇంటి వద్ద ఉండాల్సిన ఈ చిన్నారులు ప్రతి గ్రామంలోనూ తమ తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారు ఆయా పార్టీల జెండాలు పట్టుకుని నినాదాలు చేస్తూ ప్రచారాలు చేసుకుంటే ఈ చిన్నారులకు అది పెద్దపండుగలా అనిపిస్తోంది. పెద్దపెద్ద మైకుసెట్టులు, డీజేలతో హోరెత్తిస్తూ ముందుకు సాగుతున్న ప్రచార రథాల వెంబడి చిన్నారులు కేరింతలు కొడుతూ ఆయా పార్టీల జెండా లు పట్టుకుని తన్మయంతో ఉదయం నుంచి సాయంత్రం, సాయంత్రం నుంచి రాత్రి వరకు చిన్నారులంతా ఏకమై సందడిగా తిరుగుతూ సంబరాల్లో మునిగిపోతున్నారు. చిన్నారులకు ఇదొక పెద్ద పండుగ అయిపోయింది. మరో పదిరోజుల వరకు ఈ పండుగ వారికి సమ్మర్ హాలిడేస్‌లో బాగా పనికివస్తుంది.

గొడ్డలి పార్టీకి కుల'పోటు'!



కలికిరి, మే 2: కొన్ని గుర్తులు, పేర్లు ఏవేవో యదార్థ సంఘటలను గుర్తు చేస్తూ వుంటాయి. అలాంటి సంఘటనే ఓ అడవిలో జరిగింది. ఒక పెద్ద అడవిలో ఎన్నికలొచ్చాయట. అడవిలో వుండే అన్ని చెట్లకు, జంతువులకూ ఓటు హక్కు కల్పించారు. ఎన్నికల్లో అడవిలో వుండే సెలయేరు, ఓ గొడ్డలి పోటీ పడ్డాయి. చెట్లన్నీ జంతువుల ను కూడేసి 'అయ్యా.. ఈ గొడ్డలి మాకు నిత్య ప్రత్యర్థి. దీంతోనే మా జాతి ఎదుగుదల లేక మొత్తం నాశనమైపోతోంది. దీన్ని బలపరిస్తే ఇక అడవి రావణ కాష్టమవుతోంది అంటూ ప్రచారం మొదలెట్టారు. ఈ సెలయేరే మాకు ప్రాణాధారం. మీరంతా కూడా ఎన్నికల్లో సెలయేరుకు ఓటేసి గెలిపించాలని' కోరాయి. జంతువులన్నీ కూడ బలుక్కుని చెట్లు చెపుతున్నది నిజమే కదా ఈ గొడ్డలితో చెట్లకే కాకుండా తమకు కూడా ముప్పుందని అంగీకరించాయి. అంతేగాకుండా సెలయేరు మనక్కూడా ప్రాణా ధారమే కదా. అది లేకపోతే మనం బతికేదెలా అంటూ సెలయేరుకే ఓటేసేందుకు జంతువులన్నీ ఏకగ్రీవంగా తీర్మానించాయి. ఎన్నికలు ముగిశాయి. గొడ్డలి చిత్తు చిత్తుగా ఓడిపోతుందని అన్ని సర్వేలు కూడా నిగ్గుదేల్చాయి. లెక్కింపు పూర్తయ్యింది. అనూహ్య రీతిలో గొడ్డలి పెద్ద మెజార్టీతో గెలిచింది. పాపం! చెట్లకూ, జంతువులకూ ప్రాణాధారంగా వున్న సెలయేరు మోసపోయి ఓడిపోయింది. అంతా ఆశ్చర్యపోయారు. ఏం జరిగిందో అర్థం కాక జంతు నేతలు చెట్ల నేతలను పిలిచి గొడ్డలి ఎలా గెలిచిందని నిలదీశాయి. అప్పుడు ఆ చెట్లు ఇలా చెప్పుకొచ్చాయి. 'నిజమే సెలయేరు వల్ల మీరు మేము బతుకుతున్నాము. గొడ్డలి మాకు బద్ధ శత్రువు. దాని వల్ల మా జాతి అంతరిస్తోంది, ఇదీ నిజమే. అయితే గొడ్డలికున్న కర్ర మాత్రం మా కులంది. దాన్ని చూసి గెలిపించాల్సి వచ్చింది.' బహుశా ఇది విన్న ఆ జంతువులన్నీ రాత్రికి రాత్రే వేరే అడవికి పారిపోయినట్టున్నాయి.

ఇదో ఖర్చు....

కండువాల గిరాకీ... ఎంతెంతో నయా...




రాజంపేట, మే2: ప్రస్తుతం కండువాలకున్న గిరాకీ అంతాఇంతా.. ప్రధాన పార్టీలకు సంబంధించిన టీడీపీ, వైసీపీ, బీజేపీ పార్టీల కండువాలకు పెద్దఎత్తున డిమాండ్ ఉంది. ఈ మేరకు ఆయా పార్టీల నేతలు లక్షల్లో ఈ కండువాలను కొనుగోలు చేశారు. ఏ చోటుకు వెళ్లినా కండువాలను గట్టాలకు గట్టాలకు తెచ్చుకుని ఇతర పార్టీల నేలను తమ పార్టీలో చేర్చుకునే సమయంలోనూ, ప్రచారాల్లోనూ, ర్యాలీల్లోనూ, బహిరంగ సభల్లో వేసుకుంటున్నారు. కండువాలు లేకుంటే ముందుకు సాగే ప్రసక్తే లేదు. ఎన్నికల ప్రధాన సామాగ్రిగా ఈ కండువాలు పెట్టుకుని ఆయా పార్టీలు ముందుకు సాగుతున్నాయి. ఒక్కో ఎమ్మెల్యే స్థానానికి, ఎంపీ స్థానానికి పోటీచేసే అభ్యర్థులు లక్షల్లో ఈ కండువాలు కొనుగోలు చేస్తున్నారు. ఈ కండువాలు ప్రస్తుతం సరాసరి రూ.30 పడుతున్నట్లు సమాచారం.. అందువల్ల ఒక్కో అభ్యర్థికి అర్థకోటికి పైబడి ఖర్చు అవుతున్నట్లు సమాచారం.

నేతల పాట్లు....

జన సమీకరణకు డబ్బు చెల్లించాల్సిందే



పోరుమామిళ్ల, మే 2: ఏ పార్టీ కార్యక్రమమైనా, రోడ్‌షో, బహిరంగ సమావేశాలైనా విజయ వంతం కావాలంటే జన సమీకరణ తప్పనిసరి. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రధాన పార్టీల కార్యక్రమాలు, బలప్రదర్శనకు ప్రజలు, మహిళలను తీసుకువచ్చేందుకు మధ్యవర్తులు, చోటా మోటా నేతలు బేరాలు కుదుర్చుకుంటుంటారు. పెద్దపెద్ద పార్టీల నేతల కార్యక్రమాలకు రూ.500, 400వంతున డబ్బు చెల్లిస్తున్నారు. రెండురోజుల కిందట జరిగిన ఎంపీ రోడ్‌షోకు ఓ వర్గం వారు ప్రజల ను మహిళలను ఈ కార్యక్రమాల్లో పాల్గనేందుకు పిలుచుకువచ్చి కొంత మందికి డబ్బు ముట్టజెప్పకపోవడంతో వారి నుంచి నేతలకు శాపనార్థాలు మొదలయ్యాయి. చిన్న పిల్లలను సైతం ఈ కార్యక్రమాలకు తీసుకు రావడం డబ్బు అడిగితే మైనార్టీ తీరని పిల్లలకు ఎందుకు డబ్బిస్తాం, మీకు ఇస్తున్నాం కదా, వాళ్లకు కూడా డబ్బు ఇవ్వాలా అంటుండడంతో తిట్లదండకం అందుకుంటున్నారు. కొందరు అయితే గ్రామాలకు ఫోను చేసి తమ కార్యక్రమాలకు జనాలు కావాలని ఫోను చేయగా, ముందు డబ్బు పంపించండి, తరువాత జనాలను పిలుచుకు వస్తామని చెప్పడంతో ఆ నేతలు మిన్నకుండిపోతున్నారు. ఈ పదిరోజుల పాటు ప్రధానపార్టీల నేతల కార్యక్రమాలకు జన సమీకరణకు డబ్బు వెచ్చించా ల్సిందేనని, ఏ ఖర్చు పెట్టినా ఈ ఎన్నికలు అయిపోయే వరకు ఎలాగోలా నెట్టుకొస్తే తరువాత చూద్దాం అన్న రీతిలో ఉన్నారు నేతలు. మరికొందరైతే అదే పనిగా ఈ రోజు ఫలానా నాయకుని కార్యక్రమం అయిపోయింది. రేపు మీదేమన్నా ఉంటుందా, జనాలు కావాలంటే ముందుగానే చెప్పండి అంటూ సందేశాలు పంపుతున్నారు. మొత్తం మీద ఈ జన సేకరణకు నాయకులు డబ్బులు అలవాటు చేయడంతో మిగిలిన వారు తలలు పట్టుకుంటున్నారు.



టీడీపీ హయాంలో..

- సాధారణ మరణానికి రూ.2 లక్షలు
- ప్రమాదంలో మరణించినా, పూర్తి అంగ వైకల్యం కలిగినా రూ.5 లక్షలు
- పాక్షిక అంగ వైకల్యానికి రూ.3,62,500
- మట్టి ఖర్చులకు: అంత్యక్రియల సమయంలోనే రూ.5 వేలు
- వయసు: అన్నింటికీ 18 నుంచి 70 ఏళ్లు
- అర్హులు: కుటుంబంలోని సభ్యులందరూ
- నెల రోజుల్లో కుటుంబ సభ్యుల ఖాతాల్లో డబ్బులు

ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలో..

- సాధారణ మరణానికి రూ.లక్ష
- ప్రమాదంలో మరణించినా, పూర్తి అంగ వైకల్యం కలిగినా రూ.5 లక్షలు
- పాక్షిక అంగ వైకల్యానికి ఏమీ ఇవ్వడం లేదు
- మట్టి ఖర్చులకు: అంత్యక్రియలయ్యాక రెండు వారాలకు రూ.10 వేలు
- వయసు: సాధారణ మరణానికి 50 ఏళ్లు, ప్రమాద మరణానికి 70 ఏళ్లు
- అర్హులు: కుటుంబ పెద్ద మాత్రమే
- మండలాల్లో బీమా మిత్రలను తొలగించింది
- ఏళ్లు గడుస్తున్నా కుటుంబ సభ్యులకు డబ్బు అందడం లేదు

← నాడు.. నేడు బీమా పథకం అమలిలా →

బీమా.. ఏదీ ధీమా?

● వైసీపీ ప్రభుత్వంలో ఏళ్లు గడిచినా బాధితులకు అందని పరిహారం
● టీడీపీ హయాంలో కుటుంబమంతటికీ వర్తింపు ● ఇప్పుడేమో కుటుంబ పెద్దకే

జిల్లాలో 2022-23లో వివిధ ప్రమాదాల్లో 111 మంది, సహజంగా 868 మంది వంతున మొత్తం 979 మంది మరణించారు. వీరిలో 107 మందికే పరిహారం అందింది. ఆ ఆర్థిక సంవత్సరం ముగిసి ఏడాది దాటినా ఇంకా 872 మందికి వైఎస్ఆర్ బీమా అందలేదు.

2023-24 ఆర్థిక సంవత్సరంలో 743 మంది మరణిస్తే 88 మందికి పరిహారాన్ని అందించారు. ఇంకా 655 మందికి బీమా రాలేదు.

- కుటుంబ పెద్దను కోల్పోయిన పేద కుటుంబాలకు కాసింత ఆర్థికదన్నుగా నిలిచే వైఎస్ఆర్ బీమా పథకం విషయంలో జగన్ ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో ఈ గణాంకాలే నిదర్శనం. అయినా.. తాము బీమాతో అండగా నిలుస్తున్నామంటూ కన్నార్పకుండా అబద్ధాలు చెప్పడం ఈ ప్రభుత్వానికే చెల్లింది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

నా పేదలు, నా పేదలు.. అని పదేపదే సభల్లో సీఎం జగన్ చెబుతుంటారు. వాళ్లకు ఏమైనా ప్రయోజనం కలిగి ఉంటే అది తనవల్లేనని గొప్పగా అంటారు. కానీ, అలాంటి పేదలకు అండగా నిలిచే విషయంలో మాత్రం చిత్తశుద్ధి కనిపించదు. అలాంటి వాటిలో వైఎస్ఆర్ బీమా పథకం ఒకటి. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎవరైనా చనిపోతే బాధిత కుటుంబ సభ్యులకు వెంటనే చంద్రన్న బీమా గుర్తుకు వచ్చేది. మండలాల్లోని వెలుగు కార్యాలయాలను ఆశ్రయించేవారు. అంత్యక్రియల కోసం ఆ బాధితులకు రూ.5 వేలు తక్షణ సాయం అందేది. సహజ మరణమైతే రూ.2 లక్షలు, ప్రమాద మరణమైతే రూ.5 లక్షల ఆర్థిక సాయం నెలలోపు ఆ కుటుంబ సభ్యులకు అందించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పథకం పేరును వైఎస్సార్ బీమాగా మార్చారు. అమలు చేయడంలో విఫలమైంది. ఇప్పుడు మట్టి ఖర్చులకు తక్షణ సాయం అందడం లేదు. ఏళ్లు గడుస్తున్నా బాధిత కుటుంబాలకు బీమా పరిహారం దక్కడం లేదు. వైసీపీ ప్రభుత్వం అనేక రకాల నిబంధనలు పెట్టి లబ్ధిదారుల సంఖ్యను భారీగా తగ్గించింది.

టీడీపీ హయాంలో పకడ్బందీగా...

ఈ పథకం అమలు కోసం టీడీపీ ప్రభుత్వంలో మండలానికో బీమా మిత్ర పనిచేసేవారు. ఎప్పటికప్పుడు బాధితుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి నెల రోజుల్లో పరిహారం అందేలా కృషి చేసేవారు. ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం ఈ బాధ్యతను వలంటీర్లకు అప్పగించింది. వలంటీర్లు వివరాలు సేకరించి సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రాసెస్ చేస్తున్నారు. చివరిగా జిల్లా కేంద్రంలోని పీడీ కార్యాలయంలో ఫైనల్ చేస్తున్నారు. ఈ ప్రక్రియ ఆలస్యమవుతోంది. ఇంత చేసినా పరిహారం సమయానికి అందడం లేదని వాపోతున్నారు. బీమా సొమ్మును అందించే ఇన్సూరెన్సు కంపెనీలకు ప్రభుత్వం సక్రమంగా ప్రీమియం కట్టడం లేదని, అందుకే ఆయా కంపెనీలు బాధిత కుటుంబాలకు పరిహారాన్ని చెల్లించడం లేదని తెలుస్తోంది.

పాలకులూ.. వీటికేమంటారు?

మూడేళ్లుగా నిరీక్షణే..



గుడిపాలకు చెందిన ఈమె పేరు మమత. భర్త భూపతినాయుడు. ప్రైవేటు బస్సు కండక్టరుగా పనిచేసేవారు. 2021 మార్చి 7న గుడిపాల మండలంలోని వసంతాపురం వద్ద బైకులో ప్రయాణిస్తుండగా కారు ఢీకొంది. 16 రోజులు వేలూరు సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 17వ రోజు మరణించారు. ఆయన మరణించిన 15 రోజుల తర్వాత రూ.10 వేలను అందించారు. వైఎస్సార్ బీమా పథకం కింద ప్రమాదవశాత్తు మరణించడంతో రూ.5 లక్షలు పరిహారం రావాలి. మట్టి ఖర్చులకు ఇచ్చిన రూ.10 వేలు పోను మిగిలిన రూ.4.90 లక్షల కోసం బాధితురాలు మూడేళ్లకుపైగా వేచి చూస్తున్నారు. కుటుంబ పోషకుడి మృతితో వీరి కుటుంబం ఆర్థికంగా ఛిన్నాభిన్నమైంది. రోజువారి కూలి పనులకు వెళ్లే ఈమెకు ఆ డబ్బు వస్తే సపోర్టుగా ఉంటుంది.

మృతిచెంది మూడేళ్లయినా..



శాంతిపురం మండలం పొన్నేపల్లె గ్రామానికి చెందిన ఈయన పేరు చెంగ్రాయప్ప. 2021 జనవరి 21న శాంతిపురం సమీపంలో ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. పీఈఎస్ ఆస్పత్రిలో వారం రోజులు చికిత్స పొంది జనవరి 28న మృతిచెందారు. మట్టి ఖర్చులకు అధికారులు రూ.10 వేలు అందించారు. మూడేళ్లు పూర్తయినా కుటుంబ సభ్యులకు మిగిలిన రూ.4.90 లక్షల బీమా సొమ్ము రాలేదు.

నాలుగేళ్లయినా అందని బీమా



శాంతిపురం మండలం పొన్నేపల్లె గ్రామానికి చెందిన ఈమె పేరు శాంతకుమారి. కుమారుడు కార్తీక్ బీటెక్ చదివి బెంగళూరులో ఉద్యోగం చేసేవారు. కిడ్నీలో రాళ్లున్నాయంటే కుప్పంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించారు. రెండు రోజులకు పరిస్థితి విషమించడంతో స్థానిక వైద్యుల సూచన మేరకు బెంగళూరులోని పెద్దాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కార్తీక్ 2020 మార్చి ఒకటో తేదీన మృతి చెందారు. చేతికొచ్చిన కుమారుడు మరణించడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. అప్పట్లో రూ.5 వేలను అధికారులు అందించారు. మిగిలిన రూ.95 వేలను వెంటనే ఇస్తామని చెప్పారు. నాలుగేళ్లయినా ఇంకా రాలేదు.

గెలుపే లక్ష్యంగా..!

జీడీ నెల్లూరు వర్తమానం

జీడీనెల్లూరు నియోజకవర్గంలో ఈసారి గెలుపే లక్ష్యంగా టీడీపీ ముందుకు సాగుతోంది. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో వేపంజేరి కనుమరుగై.. జీడీనెల్లూరు, పూతలపట్టు ఏర్పాటయ్యాయి. జీడీనెల్లూరుకు మూడుసార్లు జరిగిన ఎన్నికల్లో 2009లో కాంగ్రెస్, 2014, 2019లో వైసీపీ గెలిచింది. తొలిసారిగా జయకేతనం ఎగురవేయాలన్న కృతనిశ్చయంతో టీడీపీ అభ్యర్థి థామస్, నేతలు, శ్రేణులు గట్టిగా పనిచేస్తున్నారు. మరోవైపు డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుటుంబం మీద ఉన్న వ్యతిరేకత, కాంగ్రెస్ నుంచి ఆయన మేనల్లుడు రమేష్ బాబు పోటీ చేస్తుండడం వంటి కారణాలతో వైసీపీ క్యాంపు డీలా పడింది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి/వెదురుకుప్పం

● పనిచేసుకుపోతున్న టీడీపీ శ్రేణులు

తీవ్రస్థాయిలో వ్యతిరేకత కూడగట్టుకున్న నారాయణస్వామి

వైసీపీపై కాంగ్రెస్ అభ్యర్థి ప్రభావం

థామస్‌కు అనేక అనుకూలతలు..



ఈసారి జీడీనెల్లూరులో జెండా ఎగురవేయాలని టీడీపీ అధిష్ఠానం భావించింది. చెన్నై ఫెర్టిలిటీ సెంటర్ అధినేత డాక్టర్ థామస్‌ను రంగంలోకి దింపింది. జూన్ 1న ఆయన్ను నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించినప్పటి నుంచీ ఆయన అందర్నీ కలుపుకొని ముందుకు వెళుతున్నారు. ఎన్నికలు దగ్గరపడిన తర్వాత పూర్తి సమయాన్ని ఆయన నియోజకవర్గానికే కేటాయించారు. ఆయనతో పాటు ఆయన సతీమణి, కుమారుడు, తమ్ముడు.. ఇలా కుటుంబ సభ్యులంతా నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్నారు. ఆ మధ్య నియోజకవర్గంలో నిర్వహించిన రా కదలిరా కార్యక్రమంలో టీడీపీ అధినేత చంద్రబాబు థామస్ గొప్పతనం గురించి వివరించారు. దాంతో ప్రజలందరికీ థామస్ గురించి మరింత తెలిసింది. ఇన్‌ఛార్జిగా నియమించిన కొత్తలో కొంతకాలం తడబాటుకు గురైనా ఆ తర్వాత నియోజకవర్గంలోని సీనియర్ల సహకారంతో పుంజుకున్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు పండుగలకు బహుమతులు పంపిణీ చేయడం, కార్యకర్తల ఇళ్లల్లో జరిగే ప్రతి కార్యక్రమాలకు హాజరవ్వడం, గ్రామాల్లో తాగునీటి ప్లాంట్లు వంటి అవసరాలను తీర్చడంతో ప్రజలకు దగ్గరయ్యారు.

నారాయణస్వామిపై వ్యతిరేకత



తన వయసునూ పక్కనపెట్టి డిప్యూటీ సీఎం నారాయణస్వామి అవకాశమున్నప్పుడల్లా సీఎం జగన్ కాళ్ల మీద పడడం.. జగన్ కోసం తన చర్మం వలిచి చెప్పులు కుట్టించుకుంటాననడం.. వంటి చర్యలతో తమ ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టారనే ఆగ్రహం దళితుల్లో ఉంది. అలాగే, మాటిమాటికీ నియోజకవర్గంలోని రెడ్ల మీద విమర్శలు చేయడంతో.. ఆయనపై వీరూ తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. ఉంది. ఆయన డిప్యూటీ సీఎంగా ఉన్నా, సతీమణిని కార్వేటినగరం జడ్పీటీసీగా అక్రమ ఏకగ్రీవం చేసుకోవడం అప్పట్లో తీవ్ర విమర్శలకు తావిచ్చింది. ప్రతి మండలంలోనూ కొండల్ని, గుట్టల్ని ఆయన ఆయన అనుచరులు చదును చేసుకుని ఆక్రమించుకున్నారు. మామిడి మొక్కలు నాటి సాగు చేపట్టారు. నియోజకవర్గంలో ఏ కొండ చూసినా గుండు కొట్టేశారు. నారాయణస్వామికి టికెట్ రాకుండా స్థానిక రెడ్డి సామాజికవర్గ నాయకులు బలంగా ప్రయత్నించి తొలుత విజయం సాధించారు. ఆ తర్వాత నారాయణస్వామి సీఎం జగన్ వద్దకెళ్లి బతిమలాడుకుని టికెట్ తెచ్చుకున్నట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. చివరగా తన కుమార్తె కృపాలక్ష్మికి టికెట్ తెచ్చుకున్నారు. ఈ వ్యతిరేకత ఆయన కుమార్తెకు ఇబ్బందికరంగా మారనుంది.

కాంగ్రెస్ అభ్యర్థితోనూ తీవ్ర నష్టం



నారాయణస్వామి గెలుపు కోసం దశాబ్దాలుగా కృషి చేసిన ఇద్దరు మేనల్లుళ్లలో ఒకరైన రమేష్‌బాబు ఆయనతో విబేధించి కాంగ్రెస్‌లో చేరారు. కృపాలక్ష్మిని ఓడిస్తానంటూ కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నారు. ఇటీవల కార్వేటినగరంలో ఆ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేసిన ప్రచారానికి ఆదరణ లభించింది. దీంతో వైసీపీ ఓట్లను ఆయన పెద్దఎత్తున చీల్చగలరని విశ్లేషకులు భావిస్తున్నారు. 2014, 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన నరసింహులుకు 1967, 2279 ఓట్లు పోలయ్యాయి. ఈసారి రమేష్ బాబు అభ్యర్థి కావడంతో ఆ ఓట్లు బాగా పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల వైసీపీకి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

ఇదీ మందు

కూలి పెంచాల్సిందేనప్పా!



'మరీ ఇంత తక్కువయితే లాబంలేదు సామీ. కూలీ పెంచకపోతే మేం వచ్చేది లేదు' అని తెగేసి చెప్తావుండారంట జనం. ఒగపక్క ముమ్మరంగా నామినేసన్లు ఏసేసినారు అబ్యర్తులు. మరోపక్క ప్రెచారాలకూ మల్లుకుని చానాకాలమే అయింది. నామినేసన్లప్పుడు ర్యాలీలు తీస్తే సరిపోతందా.. పోదుగదా. ఇప్పుడు ప్రెచారాలు గెట్టిగా చెయ్యాల. ఆమాదిరిగా చెయ్యాలంటే కనాకస్టం యాభై మంది జనం గావాల. వోల్లతోపాటు ఈదిలో జనమంతా మనపక్కే ఉండారని ఊదరగొట్టాల. అధికార పార్టీ ఈ ఐదేల్లు చేసిన దాడులు, దౌర్జన్యాలకు కడుపు మండిన జనం, ఎవురు పిల్సినా పిలవకపొయ్యినా ప్రతిపక్ష పార్టీ ప్రెచరాల్లో, ర్యాలీల్లో వొచ్చి కలిసిపోతా వుండారు. కానీ ఇప్పుడొచ్చిండే చిక్కంతా అధికార పార్టీకే. 'పథకాలిచ్చినాము గదా, ప్రెచారానికి వొచ్చెయ్యండంటే, జనం ఒగ పట్టాన కదలడంల్యా. రాకపోతే ఆ పథకాలు క్యాన్సిలు జేసేస్తామని బెదిరించడానికి ఇపుడు వాల్ల ప్రెబుత్వమూ అధికారంలో ల్యాకుండా పాయె. బలవంతంగా రాజీనామాలు చెయ్యించిన వాలంటీర్లు గూడా మనకెందుకొచ్చిన గొడవని గమ్మునుండి పొయిరి. జనంజూస్తే కొండెక్కి కూకోనుండారు. వాల్లకు నిన్నమొన్నటిదాకా ర్యాలీలకు, ప్రెచారాలకు ఎల్లొస్తే రొండొందలనింకా నాలుగొందలదాకా మాత్రమే కూలీ దక్కతా వుండాది. వాటర్ బాటిలు, బిర్యానీ ప్యాకెట్టు గూడా ఇస్తావుండారు. మొగోల్లకయితే క్వార్టరు చీప లిక్కరు అదనం. కానీ అధికార పార్టీ ప్రెచారానికి జనం పెద్దగా మొగ్గు చూపడంలేదంట. మొన్నీమజ్జ ఆ పార్టీ ర్యాలీకని తీసుకోనెల్లిన నాయకులు కక్కుర్తిపడి.. ఎదురుగుండా లేరనిజెప్పి, కొంతమంది ఆడోల్లకి కాసులు ఎగ్గొట్టడానికి జూసిన పాపం ఇప్పుడు కొడతా వుండాదంట. 'ప్రెచారాలకు ఎల్లొచ్చినాక మీరు కాసులు దర్మంగా ఇస్తారని గ్యారంటీ ఏంది?' అని ఆడోళ్లు ఎదురు తిరగతా ఉండారంట. అంతేకాదు.. 'ఎండలు మండిపోతా వుండాయి. ఈ ఎర్రటి ఎండల్లో ర్యాలీలకు, ప్రెచారాలకు వొచ్చి వడదెబ్బ తగిలి మేం ఆస్పత్రిపాలైతే మీరు జూస్తారా?' అని గూడా కొసిన్లు ఏస్తావుండారంట. కూలీ డబ్బులు ఆరేడువొందలు జేస్తేనే, అదిగూడా ముందుగా మా చేతుల్లో పెడితేనే ప్రెచారాలకు కదిలొస్తామని తెగేసి జెప్తావుండారంట జనం. డబ్బులు పంచే చోటా నాయకులమీద అస్సలు నమ్మకంలేని జనంలో కొంతమందైతే.. ముందుగా నూరో, ఇన్నూరో అడ్వాన్సు కొట్టి మల్ల మాట్లాడు' అనేస్తావుండారంట. వాల్ల డిమాండ్లను తీర్చడంతప్ప, అధికార పార్టీకి ఏరే మార్గం కనిపించడంలేదు. ప్రెతిపచ్చ పార్టీకి గూడా జనం తీరుజూసి 'ఈ పద్దినాలు ఈ ఎట్టరా ఈల్లతో ఏగాల బగమంతుడా' అనేసి గుబులు పుడతా వుండాదంటే నమ్మండి.

- కుప్పం

● గుర్తుంచుకోండి

రాజకీయ అల్లరీ నేరమే

ఏదైనా రాజకీయ పార్టీ ప్రచారానికి గ్రామాలకు వెళ్లినప్పుడు, అక్కడ నిర్వహించే సమావేశాలను ఆ పార్టీకి సంబంధం లేని వ్యక్తి అడ్డుకోవడం, భంగపరచడానికి ప్రయత్నించడం కూడా అపరాధమే అవుతుంది, ఇలాంటి నేరాలకు పాల్పడిన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష, రెండు వేల జరిమానా విధించే అవకాశం ఉంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయి. ప్రచార సభకు అధ్యక్షత వహించే నాయకుడు అనుమానం వచ్చిన వ్యక్తి గురించి వివరాలు రాబట్టుకోవచ్చు. ఇక, పోలీసులకు కూడా ఆ వ్యక్తి తన వివరాలను చెప్పకపోతే, వారెంట్ లేకుండా అతడిని నిర్బంధంలోకి తీసుకోవచ్చు.

- చిత్తూరు

● మీకు తెలుసా ?

గోడలపై రాతలు మాయం



గతంలో ఎన్నికలు వచ్చాయంటే చాలు.. గోడలన్నీ ఆయా పార్టీల అధినేతలు, అభ్యర్థుల బొమ్మలు, గుర్తులు, రాతలతో నిండిపోయేవి. ఎటు చూసినా తమ పార్టీకే ఓటు వేయాలనే ప్రచార ప్రకటనలు కనిపించేవి. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఆయా పార్టీల నాయకులు ఖాళీగా ఉన్న గోడలను రిజర్వు చేసుకునే వారు. పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించడమే ఆలస్యం. వెంటనే ప్రచార రాతలతో గోడలను నింపేసేవారు. అప్పట్లో గోడలపై రాసే, బొమ్మలేసే ఆర్టిస్టులకు డిమాండు ఎక్కువగా ఉండేది. ఎన్నికలు ముగిశాక ఇళ్ల యజమానులు రంగులేసుకునే వారు. క్రమేణా ఎన్నికల నిబంధల కారణంగా గోడమీద రాతలు కనుమరుగయ్యాయి. ఇప్పుడా స్థానంలో ఫ్లెక్సీలు చేరిపోయాయి.

- చిత్తూరు కలెక్టరేట్

● ఇదీ సంగతి

బుజ్జగింపులకే పుణ్యకాలం సరి..



వైసీపీలో విభేదాల పంచాయితీలు కొలిక్కి రావడం లేదు. ఒక పక్క గడువు ముంచుకొస్తున్నా నగరి వైసీపీ అభ్యర్థి రోజా ఎన్నికల ప్రచారం మీద దృష్టిసారించలేక పోతున్నారు. పుణ్యకాలం కాస్తా పార్టీ అంతర్గత విభేదాల పరిష్కారానికే సరిపోతోంది. కుటుంబ సభ్యులకు ప్రచార బాధ్యతలను అప్పగించి ఆమె అసమ్మతి నాయకుల అనుచరులను మచ్చిక చేసుకునే పనిలో బిజీగా గడుపుతున్నారు. ఒక్కొక్కరికి ఒకటి పదిసార్లు ఫోన్లు చేసి మాట్లాడుతున్నారు. వీలైనంత వరకు నగరిలోని తన ఇంటికి పిలిపించుకుని బుజ్జగించేందుకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. నింద్రకు చెందిన ఒక మహిళా ప్రజాప్రతినిధిని తనవైపు తిప్పుకునేందుకు ఏకంగా ఐదుసార్లు ఆమె ఇంటికి వెళ్లాల్సివచ్చింది. దీంతో ఆ మహిళా ప్రజాప్రతినిధి ఎట్టకేలకు మంత్రి రోజాను నగరిలో కలిసి మద్దతు ప్రకటించింది. ఒక్కొక్కరి ఇంటి చుట్టూ ఇన్నిన్ని సార్లు తిరగాల్సి రావడం మంత్రి క్యాంప్‌లోని వైసీపీ నాయకులకు తలనొప్పిగా మారిందనే మాటలు వినబడుతున్నాయి. దీంతో ప్రచార పర్వంలో మంత్రి రోజా వెనుకబడ్డారని నియోజకవర్గ ఓటర్లు గుసగుసలాడుకుంటున్నారు.

- పుత్తూరు అర్బన్

పింఛన్ల కోసం వృద్ధుల పాట్లు



ఫారం ఇచ్చి పంపారని చూపుతున్న వాల్మీకిపురం మహిళలు



పీటీఎం స్టేట్ బ్యాంకు వద్ద పెన్షన్‌దారుల పడిగాపులు

వాల్మీకిపురం, మే 2:పింఛన్ డబ్బుల కోసం వృద్ధుల పాట్లు వర్ణనాతీతంగా మారాయి. ఈనెల పింఛన్ సొమ్ము ప్రభుత్వం బ్యాంకు ఖాతాలు ఉన్న వారికి వారి ఖాతాల్లోనే జమ చేశారు. దీంతో వృద్ధులు వారి వారి బ్యాంకు ఖాతాల్లో నగదు పడిందో లేదో తెలుసుకోవడానికి బ్యాంకుల వద్దకు పరుగులు పెట్టాల్సివచ్చింది. బుధవారం మే డే కారణంగా సెలవు కావడం బ్యాంకులు పనిచేయలేదు. గురువారం ఉదయం నుంచి వాల్మీకిపురం మండలంలోని బ్యాంకుల చెంత పింఛన్ల కోసం వృద్ధులు నానా తంటాలు పడాల్సి వచ్చింది. మండలంలో మొత్తం 6959 పింఛన్ లబ్ధిదారులు ఉండగా వారిలో 5010మంది బ్యాంకు అకౌంట్ల ద్వారా పింఛన్ సొమ్ము నమోదు చేయగా, 1946మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అయితే ఈ పంపిణీ ప్రక్రియలో 442మంది లబ్ధిదారుల పింఛన్లు పంపిణీ చేయకపోగా తిరస్కరణకు గురయ్యాయి. స్థానిక ఇండియన్‌బ్యాంకు, గ్రామీణ బ్యాంకుల వద్ద ఉదయం నుంచి పింఛన్ సొమ్ము కోసం పడిగాపులు కాసిన వృద్ధులు, వితంతువులు, తదితరులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తమ బ్యాంకుల ఖాతాల్లో ప్రభుత్వం పింఛన్ డబ్బులు వేసిందని సచివాలయ అధికారులు చెప్పడంతో తాము బ్యాంకులకు వచ్చామని అయితే ఉదయం నుంచి వేచి చూసిన తమకు మధ్యాహ్నం 2గంటల సమయాన బ్యాంకు అధికారులు ఒక దరఖాస్తు ఫారం (కస్టమర్ సర్వీస్ రిక్వెస్ట్ ఫారం)లు చేతికిచ్చి ఇది పూర్తి చేసి తీసుకొస్తే పింఛన్ డబ్బులు ఇస్తామని చెబుతున్నారని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా వందలాది మంది పింఛన్‌దారులకు బ్యాంకు ఖాతాలు ఉన్నప్పటికీ చాలామందికి తమ సెల్‌ఫోన్ నెంబర్లు ఆధార్ నెంబరుకు అనుసంధానం లేకపోవడం, ఒకటికి రెండు బ్యాంకులలో ఖాతాలున్న మరికొంతమంది లబ్ధిదారులకు ఏ బ్యాంకులో పింఛన్ సొమ్ము జమ అయిందో తెలుసుకునేందుకు లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వచ్చింది. ఇలా కాకుండా పింఛన్ డబ్బులు ఇళ్ల వద్దకే వచ్చి పంపిణీ చేయాలని లబ్దిదారులు కోరుకుంటున్నారు. ఈ విషయమై ఎంపీడీవో సుధాకర్‌రెడ్డిని వివరణ కోరగా ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్యాంకు అకౌంట్లు ఉన్న లబ్ధిదారులకు వారి ఖాతాలలోనే పింఛన్ సొమ్ము జమ చేయడం జరిగిందని వృద్ధులు, వికలాంగులకు సచివాలయాల ద్వారా వారి వద్దకు వెళ్లి పింఛన్‌లు పంపిణీ చేశామన్నారు. 442మంది పింఛన్లు తిరస్కరణకు గురయ్యాయని వాటి విషయమై పరిశీలించి లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు పంపిణీ చేసే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: మండల కేంద్రమైన పీటీఎంలోని స్టేట్ బ్యాంకు వద్ద పెన్షన్‌దారులు పెన్షన్ సొమ్ము కోసం పడిగాపులు కాస్తున్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన పెన్షన్ దారులకు వేరువేరు బ్యాంకుల్లో ఖాతాలు కలిగి ఉండడంతో తమకు సంబంధించిన బ్యాంకుల వద్దకు పలువురు పెన్షన్‌దారులు చేరుకుని నిరీక్షిస్తున్నారు. అనేక మంది వృద్ధులు, దివ్యాంగులు ఉదయం 8 గంటలకే బ్యాంకుల వద్దకు చేరుకున్నారు. బ్యాంకుల్లో పలువురు ఖాతాలు మనుగడలో లేకపోవడం ఆ సొమ్మును బిజినెస్ కరస్పాండెంట్ల ద్వారా తీసుకోవాలని చెప్పడంతో పలువురు పెన్షన్‌దారులు అసహనానికి గురయ్యారు. గత నెల పెన్షన్ సొమ్ము సంబంధిత సచివాలయాల్లో అందచేశారు ఇప్పుడు బ్యాంకులకు తిప్పడంతో పెన్షన్‌దారులు కిలోమీటర్ల దూరం నడుచుకుంటు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరి కొందరు వృద్ధులు బ్యాంకులకు వెళ్లి తమ పెన్షన్ సొమ్ము జమ అయింతా లేదా అని బ్యాంకుల్లో పరిశీలించగా ఇంకా జమ కాకపోవడంతో వెనుదిరిగి వస్తున్నారు.

కలికిరిలో: పింఛన్ల పంపిణీ వృద్ధులకు అష్ట కష్టాలు తెచ్చిపెట్టింది. ఎవరికి బ్యాంకుల్లో జమ చేశారో, ఎవరు సచివాలయాల వద్దకు వెళ్లి తెచ్చుకోవాలనే విషయంలో స్పష్టత లేకపోవడంతో ముప్పుతిప్పలు పడ్డారు. బ్యాంకుల్లో జమచేసినా ఏ బ్యాంకులో జమచేశారన్నదీ తెలియక కొట్టుమిట్టాడారు. మరో వైపు పలువురు సిబ్బంది ఇళ్లకు వెళ్లి ఇవ్వకుండా సచివాలయాల వద్దకే రప్పిస్తున్నారనే ఫిర్యాదులున్నాయి. ఇక బ్యాంకుల్లో జమచేసిన పింఛను డబ్బులు కూడా గతంలో ఏవైనా బకాయిలుంటే వాటికి యథాలాపంగా జమ అయి ఖాతా ఖాళీ అవుతోంది. కొంత మంది ఖాతాలు స్థంభించినవీ ఉండగా మరి కొన్ని ఖాతాలు కేవైసీ పెండింగు చూపిస్తున్నాయి. మొత్తం మీద ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం కారణంగా వృద్ధులు, వితంతువులు తదితరులకు కోరి కష్టాలు తెచ్చిపెట్టినట్లుగా చెపుతున్నారు.

ఈవీఎంల పనితీరుపై అప్రమత్తంగా ఉండాలి



అధికారులకు సూచనలిస్తున్న ఎన్నికల అబ్జర్వర్ కవిత, ఆర్‌వో

మదనపల్లె టౌన్, మే 2: ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎం, బ్యాలెట్ యూనిట్, కంట్రోలింగ్ యూనిట్, వీవీప్యాట్(ఈవీఎం కమిషనింగ్)పనితీరుపై సెక్టోరియల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల అబ్జర్వర్ కవిత, రిటర్నింగ్ అధికారి హరిప్రసాద్ సూచించారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో సెక్టోరియల్ అధికారులకు ఈవీఎం కమిషనింగ్‌పై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పోస్టల్ బ్యాలెట్‌లో అభ్యర్థుల వరుస క్రమంలో 15 మంది అభ్యర్థులు, ఒక నోటా ఉండేలా చూసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని 259 పోలింగ్ కేంద్రాల్లో 5శాతం ఓట్లను ర్యాండమ్ చెకింగ్ చేయాలన్నారు. ప్రతి వెయ్యి ఓట్లు ట్యాలీ అయ్యాయా, లేదా సరిచూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ఆస్పత్రులను నిర్వహించండి

మదనపల్లె టౌన్, మే 2: ప్రైవేటు ఆస్పత్రులను ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వహించాలని అదనపు జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ శైలజ సూచించారు. గురువారం మదనపల్లె పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులను డాక్టర్ శైలజ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఆస్పత్రిలో వేసవితాపం తీర్చడానికి తాగునీరు ఏర్పాటు చేయాలని, అగ్నిప్రమాదాలు జరిగితే ఆస్పత్రి సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అడిగి తెలుసుకున్నారు. బయో వేస్ మేనేజ్‌మెంట్ నిర్వహణ, పొల్యూషన్ సర్టిఫికేట్, ఆస్పత్రి రిజిస్ట్రేషన్ రెన్యువల్ సకాలంలో చేయించుకోవాలన్నారు. అనంతరం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో హెచ్‌ఐవీ, లెప్రసి, బ్లడ్‌బ్యాంకు విభాగాలను తనిఖీ చేసి రికార్డులు సక్రమంగా ఉంచాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. క్షయ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వారికి సకాలంలో వైద్యం అందించాలని టీబీ విభాగం సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో టీబీ విభాగం సూపర్‌వైజర్ ప్రభాకర్, డీపీఎంవో వేణుగోపాల్ పాల్గొన్నారు.

రెండో రోజు బీటీ ప్రభుత్వ కళాశాలలో విచారణ

● రికార్డులు పరిశీలించిన నలుగురు కమిటీ సభ్యులు

మదనపల్లె టౌన్, మే 2: మదనపల్లె బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం రెండో రోజు కూడా నలుగురు కమిటీ సభ్యులు విచారణ చేపట్టారు. ఆరుగురు ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించకపోవడం, అనర్హులైన వారికి కొత్త ఉద్యోగాల్లో చేర్చుకోవడంపై విద్యార్థి సంఘాలు, బాధితులు ఆందోళనలు, ఫిర్యాదు ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు కడప ఆర్‌జేడీ డాక్టర్ బాబు, కమిషనర్ కార్యాలయం నుంచి చీఫ్ అకౌంట్లు ఆఫీసర్, నెల్లూరు డీకేడబ్ల్యూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ఆర్‌జేడీ కార్యాలయం నుంచి అడ్మినిస్ట్రేవ్ అధికారి సభ్యులుగా ఓ కమిటి విచారణ చేస్తోంది. బీటీ కళాశాలను ప్రభుత్వ పరం చేసేటప్పుడు అప్పటి కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ హయ్యర్ ఎడ్యుకేషన్‌కు పంపిన నివేదికలు, అందులో ఒప్పంద ఉద్యోగుల పేర్లు వున్నాయా అని పరిశీలించారు. దీంతో పాటు కొత్తగా నియమించుకున్న బోధన సిబ్బంది విద్యార్హత సర్టిఫికేట్లను పరిశీలిస్తున్నారు. వీటితో పాటు ఫైనాన్షియల్ ఖర్చులు, వాటి రికార్డులు, రసీదులు, ఆడిట్ రిపోర్టులను పరిశీలించనున్నారు. అలాగే తదుపరి విచారణలో బోధన, బోధనేతర సిబ్బందిని ఒక్కొక్కరిని పిలిచి ప్రత్యేకంగా విచారించనున్నట్లు తెలిసింది. ఈ విచారణ జరిగే సమయంలో బయటి వ్యక్తులు కళాశాలలోనికి రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

చెరువు నీళ్లను వదిలేస్తున్నారని ఫిర్యాదు

పెద్దతిప్పసముద్రం మే 2 : మండలంలోని ప్రధాన చెరువులైన పీటీఎం పెద్ద చెరువు, రంగసముద్రం రంగరాయ చెరువుల్లో నీటిని రాత్రి వేళల్లో ఎత్తేస్తున్నారని గురువారం ఆయా చెరువుల ఆయకట్టు రైతులు మదనపల్లె సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ రెండు చెరువుల్లో ఉన్న కొద్దిపాటి నీటిని ఆయా గ్రామాల్లోని మూగజీవాలైన గొర్రెలు, మేకలు, ఆవులకు ఆధారమని ఆ చెరువుల నీరే కనుక లేక పోతే ఆయా గ్రామాల్లో ఉన్న మూగజీవాల పరిస్థితి చాలా దారుణంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అదే కాకుండా ఈ చెరువుల్లో నీరు లేకుండా పోతే తాగునీటి బోర్లు కూడా ఎండిపోయే పరిస్థితి నెలకొంటుందని, ఈ చెరువుల్లో కొందరు చేపలు పట్టుకునేందుకు రాత్రి వేళల్లో తూములు వదిలేస్తున్నాకరని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సమస్యలను పలువురు రైతులు ఇరుగేషన్ అధికారులకు తెలియచేసినా కూడా ఫలితం లేకుండా పోతోందని పలువురు రైతులు వాపోయారు. కనీసం ఇప్పటికైనా సంబందిత అదికారులు ఈ సమస్యలపై దృష్టి సారించి రైతులకు న్యాయం చేయాలని ఆయ కట్టు రైతులు కోరుతున్నారు.

పోస్టల్ ఓటింగ్ కేంద్రాల ఏర్పాటు

పీలేరు, మే 2: పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 5, 6, 7 తేదీలలో పోస్టల్ ఓటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఈఆర్‌వో మహబూబ్ బాషా ప్రకటనలో తెలిపారు. 5, 6 తేదీలలో ఎన్నికల విధుల్లో పాల్గొనే అత్యవసర సర్వీసులకు సంబంధించిన పోలీసులు, ఉద్యోగులు, 6వ తేదీన టీమ్ నెం.1 నుంచి టీమ్ నెం.7లలోని పీవోలు, ఏపీవోలు, బీఎల్‌వోలు, సెక్టార్ అధికారులు, 7న టీమ్ నెం.1 నుంచి టీమ్ నెం.7లోని ఓపీవోలు ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొననున్న ఉద్యోగులందరూ నిర్దేశించిన రోజుల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీడీపీ స్టార్ క్యాంపైనర్‌గా మల్లెల రెడ్డిబాషా



పీలేరు, మే 2: టీడీపీ రాష్ట్ర ముస్లిం మైనారిటీ ఎన్నికల ముఖ్య ప్రచారకర్త(స్టార్ క్యాంపైనర్)గా పీలేరుకు చెందిన మల్లెల రెడ్డిబాషా, ఇందాదుల్లా ఎన్నికయ్యారు. టీడీపీ రాష్ట్ర కమిటీ గురువారం విడుదల చేసిన రాష్ట్ర వ్యాప్త స్టార్ క్యాంపైనర్‌లలో పీలేరు నియోజకవర్గం నుంచి వీరిద్దరికీ చోటు దక్కింది. పీలేరు పట్టణానికి చెందిన మల్లెల రెడ్డిబాషా గతంలో పీలేరు సర్పంచుగా, జడ్పీటీసీగా, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేశారు. పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యార్హత కలిగిన రెడ్డిబాషా మంచి నేతగా టీడీపీలో పేరు సంపాదించారు. అలాగే గతంలో రాష్ట్ర నూర్ బాషా కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేసిన ఇందాదుల్లా ప్రస్తుతం రాష్ట్ర నూర్‌బాషా సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. టీడీపీ మేనిఫెస్టోను ముస్లిం మైనారిటీలలో విస్తృతంగా ప్రచారం చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర కమిటీ వారిద్దరినీ స్టార్ క్యాంపైనర్‌లుగా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ పార్టీ తమపై పెట్టిన బాధ్యత, నమ్మకాన్నివమ్ము చేయకుండా ముస్లిం మైనారిటీ ఓట్లు కూటమి అభ్యర్థులకు దక్కేలా కృషి చేస్తామన్నారు.

ఆసరా డబ్బులు ఎప్పుడు జమ చేస్తారు..?



నిరసన తెలియజేస్తున్న మహిళలు

కురబలకోట, మే 2: మండలంలో చాలా గ్రూపులకు ఆసరా డబ్బులు ఎప్పుడు జమ చేస్తారని పలువురు మహిళలు అధికారులను కోరుతున్నారు. గురువారం మండలంలోని అంగళ్ళు పంచాయతీ ఇందిరాపురం కు చెందిన మహిళా సభ్యులు తమ గ్రూపులకు డబ్బులు జమ కాకపోవడంతో సచివాలయ సిబ్బందితో వాగ్వాదం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం కొన్ని గ్రూపులకు మాత్రేమే జమ చేశారని మా గ్రూపులకు ఎందుకు ఇప్పటిదాకా ఇవ్వలేదన్నారు. పలుమార్లు మీ దృష్టికి తీసుకొచ్చినా ఇప్పటి దాకా ఒరిగిదందేమీ లేదన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి శేషగిరి మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగి వెళ్లారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం..

కురబలకోట, మే 2: రక్తదానం ప్రాణదానంతో సమానమని మిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. గురువారం కళాశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రమాద సమయాల్లో రక్తం అందక ఎంతో మంది మరణిస్తున్నారని, అలాంటి వారికి ఇలాంటి రక్తదాన శిబిరాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం అలవర్చుకోవాలన్నారు.

రీజనల్ స్థాయిలో వన్‌డిపో ప్రథమ స్థానం

మదనపల్లె అర్బన్, మే2: ఆర్టీసీ రీజనల్ స్థాయిలో మదనపల్లె వన్‌డిపో అన్నివిభాగాల్లో ప్రథమస్థానంలో నిలిచిందని ఆ డిపో మేనేజరు మూరేవెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఏప్రిల్ మాసంలో ఈపీకేలో 44.15, ఓఆర్‌లో 81.73 సాధించామన్నారు. అదే విధంగా 5.50 కేఎంపీఎల్‌లతో రూ.567.48 లక్షల రూపాయలు ఆర్టీసీకి ఆదాయం చేకూర్చామన్నారు. అందరి సమష్టి కృషితోనే ఆర్టీసీ మదనపల్లె వన్ డిపో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ డీఎం అభినందనలు తెలిపారు.

వేసవి తరగతులను నిర్వహించరాదు

పీలేరు, మే 2:ప్రైవేట్ పాఠశాలలు వేసవి తరగతులను నిర్వహించరాదని పీలేరు ఎంఈవోలు లోకేశ్వరరెడ్డి, పద్మావతిలు పేర్కొన్నారు. గురువారం ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్‌ల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రైవేట్ యాజమాన్య పాఠశాలలు విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలన్నారు. వేసవిలో సమ్మర్‌కోచింగ్, ప్రత్యేక తరగతులను నిర్వహించరాదన్నారు. మండలంలో ఒకటవ తరగతిలో అడ్మిషన్ పొందిన 57 మందిని పాఠశాల్లో చేర్పించుకోవాలని సూచించారు.

గొడవలు పెట్టుకోవద్దు

గుర్రంకొండ, మే 2:గ్రామాల్లో ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలని వాల్మీకీపురం సీఐ పులిశేఖర్ సూచించారు. మండలంలోని సరిమడుగు గ్రామంలో బుధవారం రాత్రి గ్రామస్థులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల వేళ ప్రజలు ఎటువంటి గొడవలకు వెళ్లకుండా ఉండాలన్నారు. గ్రామాల్లో కొత్తవ్యక్తుల సంచారం పోలీసు లకు సమాచారం ఇవ్వాలన్నారు.

బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శిగా సోముశేఖర్



తంబళ్లపల్లె, మే 2: టీడీపీ రాజంపేట పార్లమెంటు బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శిగా కోసువారిపల్లె పంచాయతీ ఆనిగానిపల్లెకు చెందిన పి.సోముశేఖర్ నియమితులయ్యారు. పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్మోహనరాజు ఆదేశాలతో పార్లమెంటు బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీచేయగా గురువారం ఎమ్మెల్యే అభ్యర్థి జయచంద్రారెడ్డి చేతుల మీదుగా సోముశేఖర్ నియామకపత్రం అందుకున్నారు. సోముశేఖర్ బీసీ నాయకుడిగా తనదైన ముద్ర వేసుకున్నాడు. ఆయన సేవలను గుర్తించిన అధిష్టానం ఈ బాధ్యతలు అప్పగించింది. ఈ సందర్భంగా సోముశేఖర్ మాట్లాడుతూ..రానున్న ఎన్నికల్లో రాజంపేట పార్లమెంటు పరిధిలోని ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల విజయానికి కృషిచేస్తానన్నాడు. తనకీ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డికి, నియోజకవర్గ పరిశీలకుడు సీడ్ మల్లికార్జుననాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల్లో గెలిపించండి.. తంబళ్లపల్లెను అభివృద్ధి చేస్తా



పెద్దమండ్యంలో టీడీపీలో చేరిన నాయకులతో జయచంద్రారెడ్డి

బి.కొత్తకోట/తంబళ్లపల్లె/పెద్దమండ్యం మే 2 :ఎన్నికల్లో తంబళ్లపల్లె నియోజకవర్గంలో సైకిల్ గుర్తుకు ఓటేసి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం బి.కొత్తకోట మండలంలోని గట్టు, చలిమామిడి, సూరప్పగారిపల్లె తది తర గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. జయచంద్రారెడ్డి సోదరుడు శివారెడ్డి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మేనిఫెస్టోతో అన్ని వర్గాలకు లబ్ధి చేకూరు తుందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని ఇట్నేనివారిపల్లె, రామిగానిపల్లె, బలకవారిపల్లె, మేకలవారిపల్లెల్లో ఇంటింటికీ కూటమి మేనిఫెస్టో ను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ యువనేత శశిధర్‌రెడ్డి, తెలుగు యువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నరసింహులు, మాజీ జడ్పీటీసీ రామచంద్ర, సాంబ శివారెడ్డి, మునాఫ్, శీన, అంజి, శివ, జనసేన, బీజేపీ నేతలు శంకర్‌రెడ్డి, మురళి పాల్గొన్నారు. పెద్దమండ్యం మండలంలో తంబళ్లపల్లి ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి సమక్షంలో గురువారం వైసీపీ నాయకులు భారీగా టీడీపీలో చేరారు. కూటమి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి సమక్షంలో సి. గొల్లపల్లి పంచాయతీ బందెపురెడ్డిగారిపల్లి కు చెందిన వైసీపీ నాయకులు బి.ఓబులరెడ్డి, బి. చంద్రశేఖరరెడ్డి, బి. శంకర్‌రెడ్డి, ఏ. ఓబులరెడ్డి, రెడ్డప్పరెడ్డి, రామకృష్ణ, సాంబశివ, వెలిగల్లు మాజీ సర్పంచ్ క్రిష్ణారెడ్డి తో పాటు అతని అనుచరులు, సి. గొల్లపల్లి టీడీపీ సీనియర్ నాయకుడు రఘునాథ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ నాగార్జున, రామేశ్వరనాయుడు, పెద్ద రెడ్డప్ప, చిన్న రెడ్డప్ప టీడీపీలోకి చేరారు. తంబళ్లపల్లి టీడీపీ ప్రచారకర్త పరిశీలికుడు సీడ్ మల్లికార్జున, టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు విశ్వనాధరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ నాయకులు భాస్కరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, దత్తాత్రేయరెడ్డి, ప్రసాద్, గంగాధర, మనోహర్‌నాయక్, శేషాద్రి, సాంబ, బాబురెడ్డి, కాలేషా, మహేశ్వర, చలపతి పాల్గొన్నారు.

నేడు ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం

మదనపల్లె అర్బన్, మే2: ఎన్‌డీఏ అభ్యర్థుల గెలుపు కోసం శుక్రవారం సాయంత్రం మదనపల్లెలోని ఆర్యవైశ్య హాస్టల్‌నందు ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు మదనపల్లె ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు ఓంప్రకాష్, యువజన అధ్యక్షుడు యల్లంపల్లె ప్రశాంత్‌లు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదనపల్లె టీడీపీ కూటమి అభ్యర్థి ఎంషాజహాన్‌బాషాలు సమావేశంలో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య కుటుంబసభ్యులు అందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.


వేసవి జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి

కలకడ, మే 2:ప్రజలు వేసవిలో వడదెబ్బ బారీన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని డీపీఎంవో రీయాజ్ బేగ్ ఆదేశించారు. గురువారం ఆయన డీఎస్‌ఎంవో విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి ఆసుపత్రిలని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీల కాన్పులు ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగేలా ప్రోత్సహించాలని కోరారు. డాక్టర్ మల్లికార్జున్, మోహన్‌లు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

నిమ్మనపల్లి, మే 2: ఎన్నికల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులను గెలిపించాలని గురువారం కొండయ్యగారిపల్లి పంచాయతి వెంకోజిగారిపల్లిలో మాజీ జిల్లా కో-ఆప్షన్ నెంబరు సుధాకర్‌రావు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రలజలకు వివరిస్తూ బీసీలకు 50ఏళ్లకే పింఛన్‌ను ప్రవేశపెట్టిదని వాటితో పాటుగా ఆర్టీసీ బస్సుల్లో మహిళకు ఉచిత ప్రయాణం, మహిళకు నెలకు రూ.1500, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, చదుకొనే విద్యార్థులకు రూ.15వేలు ఇస్తామన్నారు. రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ.20 వేలను అందించన్నుట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటరమణ, రాజంపేటఅధికార ప్రతినిధి ఆర్వేవెంకటేష్, మాజీ ఎంపీపీ రెడ్డెప్పరెడ్డి, బీసీ అధికార ప్రతినిధి లక్ష్మన్న, సర్పంచ్ రెడ్డెప్ప, మాజీ ఎంపీపీ రామకృష్ణ, మాజీ సర్పంచ్‌లు రాజన్న, రమణ, మల్లప్ప, మహమ్మద్‌రఫి, శ్రీరాములు, మల్లికార్జున, నాయకులు మురళి, కేశవ, గోపాలక్రిష్ణ, చంద్రసింగ్, సోము, శ్రీనివాసులు, నరసింహులు, శ్రీపతి, సుధాకర్, సహదేవ, జగదీష్, రెడ్డెప్ప, జయన్న, చినబాబు, చెంద్రాయుడు, ఖసింఖాన్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి



కలకడలో టీడీపీలో చేరిన నాయకులతో నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి



పీలేరులో తనూజారెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు

పీలేరు, మే 2: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి పీలేరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పీలేరు మండలం అగ్రహారం, కాకులారంపల్లె గ్రామ పంచాయతీల్లో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఇటీవల ప్రకటించిన వృద్ధాప్య పెన్షన్ రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, యువతకు నిరుద్యోగ భృతిగా నెలనెలా రూ.3 వేలు, పాసు బుక్కు కలిగిన ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సాయం పథకాలకు రాష్ట్ర ప్రజలలో మంచి స్పందన లభించిందన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్, ఓట్లు వేసిన రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని దారుణంగా వమ్ము చేశారని ధ్వజమెత్తారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో మరో మారు మోసపోకుండా కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కిశోర్ సమక్షంలో అగ్రహారం పంచాయతీ కమ్మమిట్టపల్లెకు చెందిన వైసీపీ నాయకులు శంకర్ రెడ్డి, వినోద్ కుమార్ రెడ్డి తమ అనుచరులు, బంధువులతో కలిసి టీడీపీలో చేరారు. వారందరికీ ఆయన పసుపు కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు అమరనాథరెడ్డి, యల్లెల రెడ్డప్పరెడ్డి, యల్లెల మాంచాల, బొజ్జిరెడ్డి, చిన్నారెడ్డి, జయచంద్రారెడ్డి, సర్పంచ్ ప్రభాకర, బాలగంగాధర్ రెడ్డి, బన్నా, ధన, శివ, మాధవరాజు, బీజేపీ నాయకులు చంద్రశేఖర రెడ్డి, వెంక టరమణ, మహదేవనాయుడు, పీఎం ఖాన్, జనసేన నేత నరేశ్ పాల్గొన్నారు.

టీడీపీకి అండగా ఉండి గెలిపించండి

గుర్రంకొండ, మే 2: మండలంలోని గుర్రంకొండ, తరిగొండ గ్రామాల్లో గురువారం ఇంటింట ప్రచారం నిర్వహించిపార్టీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను గురించి ప్రజలకు వివరించారు. రాజంపేట పార్లమెంట్ కూటమి అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని, పీలేరు అసెంబ్లీ అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్, నౌషాద్, చంద్రబాబు, నక్కా సతీష్, రామయ్య, రంజిత్, మౌలా, హేస్సాన్, తన్వీర్, జయప్రకాశ్, రెడ్డెన్న, నవీన్, రమణలు పాల్గొన్నారు.

20 కుటుంబాలు టీడీపీలో చేరిక

కలకడ, మే 2:మండలంలోని కోన గ్రామం గంగిరెడ్డిగారిపల్లె దళితవాడకు చెందిన 20 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. పార్టీలో చేరిన వారిలో పనీల్‌కుమార్, రమేష్, సుధాకర్, రఘుకుమార్, సురేష్, అశోక్, ప్రశాంత్, సత్యమయ్య, ప్రభు ఉన్నారు. నాయకులు శ్రీని వాసుల రెడ్డి, కాంతారావు, చంద్రమోహన్, త్యాగరాజు, రామాంజులు ఉన్నారు.

ఆడపడుచులకు చంద్రన్న కానుక 'మహాశక్తి' పథకం

పీలేరు, మే 2: రాష్ట్రంలోని ఆడపడుచులకు చంద్రబాబు నాయుడు కానుకగా 'మహాశక్తి' పథకాన్ని అందించనున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి సతీమణి నల్లారి తనూజా రెడ్డి పేర్కొన్నారు. తన కూతురు వైష్ణవి, కోడలు నల్లారి షమా రెడ్డితో కలిసి గురువారం ఆమె పీలేరు మండలం దొడ్డిపల్లె పంచాయతీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్నికలలో పీలేరు అసెంబ్లీ అభ్యర్థి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డిని, రాజంపేట ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నేతలునారే సతీశ్, రెడ్డప్ప, జీవీ రవికుమార్, సుభాష్, సయ్యద్ బాషా, ఆదినారాయణ, సుధీర్, సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, మోహన్, రవి, మురళి, పురం రెడ్డమ్మ, చందన, కుమారి, రమాదేవి పాల్గొన్నారు.